



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY



ఈ స్థలం [22 సెంట్లు]

అమ్మబడును




సంప్రదించవలసిన నెంబర్లు

కె. అబెడ్నేగో(రాజు బాబు ) : 9985998066

సిహెచ్. సురేష్ : 9959996243

RAYAVARAM MANDAL, RAYAVARAM VILLAGE, EGDT : 533346



SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE


సంపుటి : 9 సంచిక : 162 తూర్పుగోదావరి జిల్లా ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ గురువారం 05 మార్చి 2026 పేజీలు : 12 వెల : 2/-


## 20 నెలల్లో 6.28 లక్షల

# ఉద్యోగాలు కల్పించాం

- ప్రపంచంలో పేరున్న పరిశ్రమలు రాష్ట్రానికి తీసుకొస్తున్నాం
- పారిశ్రామికవేత్తలు వెళ్ళిపోతున్నారంటూ వైసీపీ దుష్ప్రచారం
- గత పాలకులు మెడికల్ కాలేజీలకు భూమిని చూపించలేదు
- పీపీపీ విధానంలో నిర్మిస్తే అది ప్రైవేట్ పరం కాదు...ప్రభుత్వ ఆధీనంలోని ఆస్తి
- గత పాలనలో ఎక్సైజ్‌లో అతిపెద్ద కుంభకోణం
- శాసన సభలో ప్రసంగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు





**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక 20 నెలల్లో 6.28 లక్షల మందికి ఉద్యోగాల కల్పించామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఈ మేరకు ఎంఎస్ఎంఈలో 2.48 లక్షలు, స్కిల్ డెవలప్మెంట్ ద్వారా 1.46 లక్షలు, పరిశ్రమల్లో 95 వేలు, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో 64 వేల మందికి ఉద్యోగాలు వచ్చాయని వివరించారు. మెగా డీఎస్సీ, పోలీసు కానిస్టేబుళ్లు, ఇతర ప్రభుత్వ ఉద్యోగాలు 30,500 కల్పించామని తెలిపారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చామని..అంతకంటే ఎక్కువ ఉద్యోగాలే కల్పించి హామీని నిలబెట్టుకుంటామని ఉద్ఘాటించారు. ఇందుకోసం ఓ కమిటీని కూడా నియమించామని అన్నారు. పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఐటీ, ఉద్యోగాల కల్పన, వైద్య, విద్య తదితర రంగాలపై శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు.

**గత పాలనలో యువత పొరుగు రాష్ట్రాలకు వలస పోయింది**

అసెంబ్లీలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ '2019-24 మధ్య ఏపీ బ్రాండ్ పూర్తిగా దెబ్బతిన్నది. జాకీ, అమర్ రాజా, లులూ, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ లాంటి కంపెనీలు రాష్ట్రాన్ని వదిలిపెట్టి పోయాయి. వైసీపీ ఉన్నంత వరకూ ఏపీకి తిరిగి రామని చెప్పి మరీ ఆ కంపెనీలు వెళ్లిపోయాయి. పూర్తిగా నెగెటివ్ ఇమేజ్‌ని సృష్టించి గత పాలకులు వెళ్లారు. 2019-20 నుంచి 2023-2024 ఆర్థిక సంవత్సరంలో 913 కంపెనీలు మూతపడినట్టు ఆర్బీఐ నివేదికలో పేర్కొంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంటే చిరునామా ఏపీ ఉండేది. ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు కేరాఫ్ అడ్రస్‌గా ఏపీ ఉంది. 26 పాలసీలతో వేగంగా పెట్టుబడులకు అనుమతులు ఇస్తున్నాం. పర్యాటకానికి పారిశ్రామిక హోదా ఇచ్చి ప్రోత్సహిస్తున్నాం. 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కులు కూడా ఏర్పాటు చేస్తున్నాం. అలాగే పారిశ్రామిక ప్రోత్సాహకాలను కూడా రూ.210 కోట్ల మేర విడుదల మిగతా .. 2లో..

## టీటీడీ చైర్మన్ వ్యవహారం, లడ్డూ కాంట్రాక్టుపై

# వైఎస్ జగన్ సీరియస్



**తాడేపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు వ్యవహార శైలి, తిరుమల లడ్డూ కాంట్రాక్టులో స్కాంపై వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పవిత్రమైన తిరుమల ఆలయ ప్రతిష్టను దెబ్బ తీస్తున్నారంటూ విమర్శించారు. పవిత్రమైన తిరుమలను స్వార్థ రాజకీయాలకు వేదికగా మార్చారని సీఎం చంద్రబాబుపై మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ట్విట్టర్ వేదికగా..'దేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులకు కలియుగ ప్రత్యక్ష దైవం, వేంకటేశ్వరస్వామి కొలువై ఉన్న తిరుమల. తిరుపతి ఆలయాల నిర్వహణ, పరిపాలన అత్యంత పవిత్రమైన బాధ్యత. అత్యంత నిష్ఠతో చేయాల్సిన బాధ్యత. అలాంటి టీటీడీ చైర్మన్ పదవిలో నిష్కలంక వ్యక్తిత్వం, అచంచల భక్తి, నిబద్ధత, నిష్ఠ కలిగిన వారే ఉండాలి. కానీ చంద్రబాబు ఈ పవిత్రమైన స్థానాన్ని మిగతా .. 2లో..

# మంత్రి ఆనంపైకి దూసుకొచ్చిన వైకాపా ఎమ్మెల్సీ

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుమల లడ్డూ కల్తీ అంశంపై శాసన మండలిలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రకటన చేసే సమయంలో వైకాపా ఎమ్మెల్సీలు దురుసుగా ప్రవర్తించారు. మంత్రిపైకి వైకాపా ఎమ్మెల్సీ మాధవరావు దూసుకొచ్చారు. ఆయనకు మద్దతుగా ఇతర వైకాపా సభ్యులు కూడా వచ్చారు. దీంతో వైకాపా సభ్యుల తీరుపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. తేల్చుకుందాం రండి అంటూ మాధవరావుకు ఆనం ఎదురెళ్లారు. మంత్రి ఆనం వెంట కూటమి ఎమ్మెల్సీలు వచ్చారు. దీంతో మంత్రులు జోక్యం చేసుకుని ఇరు వర్గాలకు సర్దిచెప్పారు.

## శ్రీలంక తీరంలో

# ఇరాన్ యుద్ధనౌక మునక..

## 100 మందికిపైగా గల్లంతు?



**విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ.. శ్రీలంక తీరంలో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. తమ దేశ దక్షిణ తీరంలో మునిగిపోతున్న ఓ ఇరాన్ యుద్ధ నౌక నుంచి 32 మందిని రక్షించి, ఆసుపత్రిలో చేర్చినట్లు శ్రీలంకకు చెందిన ఓ ఉన్నతాధికారి తెలిపారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని, ఏడుగురికి అత్యవసర చికిత్స అందిస్తున్నామని వెల్లడించారు. "గాలె తీరానికి 40 నాటికల్ మైళ్ల దూరంలో 'ఐఆర్ఐఎస్ దేనా' అనే ఇరాన్ యుద్ధ నౌక ప్రమాదంలో ఉన్నట్లు శ్రీలంక నౌకాదళానికి సమాచారం అందింది. వెంటనే సహాయక చర్యల కోసం నౌకలు, మిగతా .. 2లో..

## ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ కోసం కలిసికట్టుగా

# ముందుకు సాగుదాం

- ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతివిద్యార్థిని సొంత బిడ్డలా భావిద్దాం
- గత ప్రభుత్వంలో 117 జీవో తెచ్చి ప్రభుత్వ విద్యావ్యవస్థను కుప్పకూల్చారు
- గతపాలనలో 10లక్షల మంది ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారు
- యూనివర్సిటీలను బంధుగణంతో నింపేసి భ్రష్టుపట్టించారు
- స్కూలు కిట్స్, చిక్కీ, గుడ్లలో రూ.1,000 కోట్లు ఆదా చేస్తున్నాం
- 90రోజుల్లో న్యాయచిక్కులు తొలగించి అధ్యాపక పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
- శాసనసభలో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యారంగంలో తాము చేపట్టిన సంస్కరణల నేపథ్యంలో ఈ సంవత్సరం ఉత్తమ ఫలితాలు సాధిస్తామన్న నమ్మకం ఉంది. వచ్చే శాసనసభ సమావేశాల్లో విద్యాశాఖ రిపోర్టు కార్డును సభ ముందుంచుతాం. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, అధికారులు, ప్రజా ప్రతినిధులందరం కలిసికట్టుగా పనిచేసి ఆంధ్ర మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రపంచానికి చాటుదాం, పిల్లల భవిష్యత్తును అత్యుత్తమంగా తీర్చిదిద్దుదామని మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు. శాసనసభలో మంత్రి లోకేష్ స్కూల్ ఎడ్యుకేషన్‌కు రూ.32,308.31 కోట్లు, ఉన్నత విద్యకు రూ.2,566.80 కోట్లు, స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ శాఖకు రూ.1231.91 కోట్లు, ఐటీ & ఎలక్ట్రానిక్స్‌కు రూ.536.28 కోట్ల బడ్జెట్ డిమాండ్ ప్రతిపాదనలను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ఇతర రాష్ట్రాలు మనల్ని చూసి నేర్చుకునేలా ఆంధ్రమోడల్ కోసం పార్టీలకు మిగతా .. 2లో..

## బీసీలను

# అభివృద్ధి చేసింది మేమే

## రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** 'అయిదేళ్లలో వెనుకబడిన తరగతులకు జగన్ చేసింది శూన్యం, బీసీలకు పునాదులు మేమే... వారిని అభివృద్ధి చేసింది కూడా మేమే..' అని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. బీసీలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. ఏపీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా బుధవారం శాసనమండలిలో ప్రశ్నోత్తర సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నకు మిగతా .. 2లో..

## సీఎం కుర్చీ కోసం

# విప్లవం అవసరం లేదు

## డీకే శివకుమార్



**విశ్వం వాయిస్ న్యూస్ :** కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు అంశం మరోసారి చర్చకు వచ్చింది. ఈ విషయంపై డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం స్థానం దక్కాలంటే విప్లవం లేవనెత్తాల్సిన అవసరం లేదని.. కాలమే నిర్ణయిస్తుందని అన్నారు. పార్టీ కోసం తాను చేస్తున్న కృషి అందరికీ తెలుసన్నారు. ఏ సమయంలో తనకు ఏ స్థానం ఇవ్వాలనే విషయంపై పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సహా పార్టీ కేంద్ర నాయకత్వం కర్ణాటక సీఎం మార్పుపై చర్చలు జరిపినట్లు వస్తోన్న వార్తల గురించి తనకు ఎటువంటి సమాచారం మిగతా .. 2లో..

## హర్మ్యూజ్‌లో చమురు నౌకలకు..

# అమెరికా నేవీ రక్షణ

## అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హామీ



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో చమురు రవాణాకు కీలకమైన హర్మ్యూజ్ జలసంధిని మూసివేస్తున్నామని ఇరాన్ ప్రకటించింది. దీంతో ఇంధన రవాణాకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. ఈ పరిణామాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. హర్మ్యూజ్ మీదుగా వెళ్లే చమురు ట్యాంకర్లకు అవసరమైతే అమెరికా నేవీ రక్షణ కల్పిస్తుందని వెల్లడించారు. వీలైనంత త్వరగా దీనిపై నిర్ణయం తీసుకుంటామని ట్రంప్ పేర్కొన్నారు. ప్రపంచానికి ఇంధన సరఫరాలో ఎటువంటి ఇబ్బంది లేకుండా అమెరికా తప్పకుండా చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ మేరకు తన ట్రూత్ ఖాతా పోస్ట్‌లో మిగతా .. 2లో..

## ఏపీలో జర్నలిస్టులను

# విస్మరించము.. నిర్లక్ష్యం చేయం..

**సమస్యలు పరిష్కారానికి ముందుంటా..- దశలవారీగా పరిష్కారం చూపిస్తా..**
**జర్నలిస్టుల సంక్షేమ నిధికి రూ.5 లక్షలు విరాళం**
**రాష్ట్ర సమాచార పౌరసరఫరాల మంత్రి కొలుసు పార్థసారథి**







**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** జర్నలిస్టుల పట్ల తమ ప్రభుత్వానికి సానుకూలతే ఉందని.. వివిధ సందర్భాల్లో జిల్లాల్లో జర్నలిస్టు సంఘాల నాయకులు తమ దృష్టికి తెచ్చిన సమస్యలను చర్చిస్తుంటామని.. ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్తుంటామని రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కే.పార్థసారథి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్), ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (ఏపీబీజేఏ) మిగతా .. 2లో..

## ఏపీ పర్యాటక రంగం

# ఇక 'రాష్ట్ర ఆర్థిక వృద్ధి యంత్రం'

- నూతన పర్యాటక పాలసీ 2024-29, పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదాతో నూతనోత్తేజం
- 20 నెలల కాలంలోనే రూ.19,693 కోట్ల పెట్టుబడుల ఆకర్షణ
- 27కు పైగా ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ అనుమతులు జారీ
- తద్వారా 1.22 లక్షల కొత్త ఉద్యోగాల కల్పనకు మార్గం సుగమం
- నంది అవార్డులు, నంది నాటకోత్సవాల పునరుద్ధరణకు శ్రీకారం
- సినిమా షూటింగ్‌లకు ఏపీలో ఉచిత అనుమతులు - చిన్న చిత్రాలకు భారీ రాయితీలు
- తిరుపతిని గ్లోబల్ డెస్టినేషన్ హబ్‌గా, విశాఖను, అమరావతిని మెగా టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతాం
- శాసనసభలో మంత్రి కందుల దుర్గేష్



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** గత ఐదేళ్ల విధ్వంసం నుంచి పర్యాటక, సాంస్కృతిక రంగాలను గట్టెక్కించి ఆంధ్రప్రదేశ్‌ను 2047 నాటికి అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రివర్యులు కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. బుధవారం శాసనసభలో పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖలపై జరిగిన చర్చకు ఆయన సుదీర్ఘ వివరణ ఇచ్చారు. ఏపీ పర్యాటక రంగం ఇక 'రాష్ట్ర ఆర్థిక వృద్ధి యంత్రం'గా అభివర్ణించారు.

**పర్యాటక రంగంలో విప్లవాత్మక మార్పులు**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో మిగతా .. 2లో..

## మిగతావారికి ఇవి ఎన్నికలు..

# మా పార్టీకి భావోద్వేగం

## ప్రముఖ నటుడు విజయ్



**విశ్వం వాయిస్ న్యూస్ :** కొన్ని నెలల్లో జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈసారి ప్రముఖ నటుడు విజయ్ పార్టీ టీవీకే (తమిళగ వెట్రి కళగం) బరిలో ఉండటమే అందుకు కారణం. తంజావూరు జిల్లాలో జరిగిన బహిరంగ ర్యాలీలో పార్టీ మ్యానిఫెస్టోను విజయ్ ఆవిష్కరించారు. ఈసారి జరిగే ఎన్నికలు ఇతరులకు సాధారణమేనని, అయితే తనకు మాత్రం ఇవి ఓ భావోద్వేగమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. "తమిళనాడులో ఈసారి జరిగే ఎన్నికలు ఇతరులకు సాధారణమేనని.. కానీ నాతో పాటు నన్ను ప్రేమించే ప్రజలకు భావోద్వేగం. ఈ సారి ఎన్నికల్లో ఢిల్లీ టీమ్ (భాజపా)తో సహా మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# ఉద్యోగాలు కల్పించాం

చేశాం. ఇటీవల విశాఖలో నిర్వహించిన పెట్టుబడుల సదస్సులో రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. వాటిద్వారా 16 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోంది. విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్లు అభివృద్ధి చేస్తున్నాం. 2047కు 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఏపీ తయారవుతుంది. విశాఖ ఐటీ, జీసీసీల కేంద్రంగా తయారవుతుంది. ఎవరూ ఊహించనన్ని పెట్టుబడులు విశాఖకు వచ్చాయి' అని ముఖ్యమంత్రి అన్నారు.

**పేరున్న పరిశ్రమలు రాష్ట్రానికి వస్తున్నాయి**

'అమరావతికి క్వాంటం లాంటి ఎకోసిస్టం వస్తోంది. తిరుపతిని కూడా స్పేస్, ఎలక్ట్రానిక్స్, డిఫెన్సు పరిశ్రమలతో అభివృద్ధి చేస్తాం. గూగుల్, టాటా- టీసీఎస్ లాంటి పెద్ద కంపెనీలు విశాఖకు వచ్చాయి. ఆర్సెలార్ మిట్టల్ ఉక్కు పరిశ్రమ వస్తోంది. 20 నెలల్లోనే ప్రపంచంలోనే పేరున్న పరిశ్రమలు కంపెనీలు ఏపీకి వచ్చాయి. ఈ నెలలో ఆర్సెలార్ మిట్టల్, వచ్చే నెలలో గూగుల్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేయబోతున్నాం. ఏఎం గ్రీన్ ద్వారా గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తికి కూడా శ్రీకారం చుట్టాం. ఎన్టీపీసీ ద్వారా 1.85 లక్షల కోట్లతో గ్రీన్ ఎనర్జీ తయారీ కోసం కూడా ప్లాంట్ ఏర్పాటు చేయబోతోంది. టాటా సంస్థ కూడా రూ.6 వేల కోట్ల పెట్టుబడులతో యూనిట్ ఏర్పాటు చేయబోతోంది. ఇలా ప్రముఖ సంస్థలన్నీ రాష్ట్రానికి పెట్టుబడులతో ముందుకు వచ్చాయి. భవిష్యత్తులో ఈ పెట్టుబడులను సుస్థిరం చేయడానికి పారిశ్రామిక ప్రోత్సాహకాల కోసం ఎస్క్రో ఖాతాను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. గత ప్రభుత్వంలో యువత పొరుగు రాష్ట్రాలకు వలస పోయిన పరిస్థితి. పెట్టుబడులకు ప్రిఫర్డ్ డెస్టినేషన్‌గా ఏపీ మారుతుంది. ఎన్డీఏ పాలన ఉన్నంత కాలం ఏపీకి పారిశ్రామిక వేత్తలు క్యూ కడతారు. దీనిని భరించలేక వైసీపీ నెగటివ్ ప్రచారాన్ని మొదలు పెట్టింది పెట్టుబడులు అంటే విముఖత చూపిస్తున్నట్టుగా దుష్ప్రచారం చేస్తున్నారు' అని సీఎం చంద్రబాబు మండిపడ్డారు.

**ఆవిష్కరణలు, నైపుణ్యాలకు పదును పెడుతున్నాం**

'ఏపీ అంటే పెట్టుబడిదారుల్లో విశ్వాసం కల్పించాం. ఏపీ అంటే బ్రాండ్ అనే పేరు మళ్లీ తీసుకువచ్చాం. భారత్‌లో తొలి క్వాంటం కంప్యూటర్ వ్యాలీ అమరావతికి వచ్చింది. అమెరికాలో సిలికాన్ వ్యాలీ ఉంటే అమరావతి క్వాంటం వ్యాలీకి అడ్రస్‌గా మారుతుంది. వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ ద్వారా ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాం. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా రాష్ట్రంలోని 5 జోన్లలో ఆవిష్కరణలకు, నైపుణ్యాలకు పదును పెడుతున్నాం. గత ప్రభుత్వంలో ఎవరికీ నైపుణ్యాలను కల్పించలేక పోయారు. మా ప్రభుత్వంలో మానవ వనరులను అభివృద్ధి చేయటంతో పాటు అత్యుత్తమ ఉపాధి కల్పించేలా ప్రభుత్వం కార్యాచరణ చేపడుతుంది' అని ముఖ్యమంత్రి ప్రకటించారు.

**మెడికల్ కాలేజీల నిర్మాణానికి భూమి చూపించలేదు**

'దేశంలోనే తొలిసారి ప్రజలందరికీ వర్తింప చేసేలా యూనివర్సల్ హెల్త్ పాలసీ తీసుకువస్తున్నాం. రూ.2.5 లక్షల వరకూ ఉచితంగా వైద్య సేవలు అందించేలా ఈ విధానం ఉంటుంది. అతి తక్కువ వ్యయంతోనే వైద్య చికిత్సలు అందేలా చర్యలు చేపడుతున్నాం. పీపీపీ విధానంలో మెడికల్ కళాశాలల నిర్మాణం చేపడుతున్నాం. గత పాలకులు కనీసం వైద్య కళాశాలలకు భూమి కూడా చూపించలేదు. ప్రతీ నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రి ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. పీపీపీ అంటే ప్రైవేటు కాదని మరోమారు ప్రజలకు చెబుతున్నాం. ఇది పూర్తిగా ప్రభుత్వ ఆస్తిగానే ఉంటుంది. అన్ని మెడికల్ కళాశాలల్లోనూ ప్రభుత్వ నిబంధనల ప్రకారమే సేవలు అందుతాయి. సంజీవని ప్రాజెక్టు ద్వారా ప్రతీ ఒక్కరి ఆరోగ్యం కోసం డిజిటల్ హెల్త్ రికార్డులు రూపొందిస్తున్నాం. ప్రజలందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం' అని సీఎం స్పష్టం చేశారు.

**తెలుగును కాపాడే బాధ్యత తీసుకుంటాం**

'విద్యా రంగంలో మరింత మెరుగైన ఫలితాల కోసం ఏటా రాష్ట్రంలో మెగా పేరెంట్ టీచర్స్ మీటింగులతో సమీక్షించుకుంటున్నాం. గత పాలకుల వల్ల విద్యా రంగం దిగజారి పోయింది. ప్రాథమిక విద్య ఎక్కడైనా మాతృభాషలోనే ఉంటుంది. ప్రపంచానికి తెలివైన యువతను అందించటంతో పాటు తెలుగును కాపాడుకునే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుంది' అని సీఎం చంద్రబాబు అన్నారు.

**ప్రముఖ కంపెనీలతో పర్యాటక ప్రాజెక్టులు అనుసంధానం**

'అతిథి దేవోభవ అన్నది మన విధానం. దీనిని అనుసరించే పర్యాటక విధానాన్ని రూపొందించాం. ప్రకృతి వనరులకు మన రాష్ట్రంలో కొదవలేదు. భూకేటాయింపులు సహా వివిధ ప్రోత్సాహకాలను ప్రాజెక్టులకు అందిస్తున్నాం. పెద్ద ఎత్తున ఉపాధి కల్పించేలా పర్యాటక పాలసీకి రూపకల్పన చేశాం. 102 ఎంఓయ్నరీల ద్వారా రూ.18 వేల కోట్ల పెట్టుబడులు కూడా రాష్ట్రానికి వచ్చాయి. 3.4 లక్షల మందికి దీని ద్వారా ఉద్యోగాలు వస్తాయి. 7,348 హోటల్ గదుల నిర్మాణానికి అనుమతులు కూడా ఇచ్చాం. సూర్యలంక బీచ్‌ను గోవాతో పోటీ పడేలా తీర్చిదిద్దుతాం. అఖండ గోదావరి, పాపికొండలను కూడా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తాం. గండికోట మన దేశపు గ్రాండ్ కాన్యన్. దీనిని కూడా అద్భుతంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. ప్రసాద్ స్కీమ్ కింద వివిధ దేవాలయాలను కూడా అభివృద్ధి చేయబోతున్నాం. కారావాన్, హోం స్టేలు, టెంట్ సిటీల ద్వారా పర్యాటకాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నాం. అంతర్జాతీయ స్థాయి కంపెనీలతో వీటిని అనుసంధానించి పర్యాటక ప్రాజెక్టులు పెద్ద ఎత్తున తీసుకు వస్తున్నాం' అని సీఎం చంద్రబాబు తెలిపారు.

**ఎక్సైజ్‌లో కుంభకోణానికి పాల్పడ్డారు**

'గత పాలకుల హయాంలో ఎక్సైజ్‌లో అతిపెద్ద కుంభకోణం చేశారు. దీనిపై కేబినెట్ సబ్ కమిటీని వేసి విచారణ చేస్తున్నాం. సొంత బ్రాండ్లు తెచ్చి వ్యాపారం చేసి ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేశారు. ఇప్పుడు మొత్తం పారదర్శకంగా మార్చి అంతర్జాతీయ బ్రాండ్లు తీసుకువచ్చాం. ఎవరు తప్పు చేసినా కఠినంగా చర్యలు తీసుకుంటున్నాం. ప్రజల ఆరోగ్యమే మాకు అత్యంత ప్రాధాన్యం. గత ప్రభుత్వంలో నాసిరకం మద్యం సేవించి 30 వేల మంది వరకూ అనారోగ్యాల పాలై మరణించారు. ప్రస్తుతం ఎక్సైజ్ విధానాన్ని ప్రక్షాళన చేశాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు శాసనసభలో అన్నారు.

# వైఎస్ జగన్ సీరియస్

స్వార్థ రాజకీయాలకు వేదికగా మార్చారు. ఆలయ ప్రతిష్ఠను మంటగలిపేలా వ్యవహరించారు. ఒక బాధిత మహిళ ఎన్నికలకు ముందే చంద్రబాబుగారికి లేఖ రాస్తూ, ప్రస్తుత టీటీడీ చైర్మన్ తనను మోసం చేశాడని, తన జీవితంతో ఆడుకున్నాడని ఏ చిన్న పనితో ఆడవారు వచ్చినా వారిని ఇబ్బంది పెడతారంటూ ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఒక బాధ్యత ఉన్న వ్యక్తిగా చంద్రబాబు ఈ ఫిర్యాదుపై విచారణ చేసి చర్యలు తీసుకోవాల్సింది పోయి, ఇన్ని రకాల ఆరోపణలు ఉన్నాయని తెలిసి కూడా విచారణ, చర్యలు పూర్తిగా పక్కనపెట్టి, అతన్నే టీటీడీ చైర్మన్‌గా నియమించి ఆలయ ప్రతిష్ఠను, పవిత్రతను కాలరాశారు. దేవుడి పట్ల భక్తి ఉన్నవారు ఎవరైనా ఇలా చేస్తారా?. ఆలయ పవిత్రతను కాపాడాలన్న ఉద్దేశం ఉంటే ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటారా. చంద్రబాబు?కు భక్తి లేదు, శ్రద్ధ అంతకన్నా లేదు, దేవుడి పట్ల భయం కూడా లేదని మరోసారి రుజువైంది. దేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులకు కలియుగ ప్రత్యక్ష దైవం, వేంకటేశ్వరస్వామి కొలువై ఉన్న తిరుమల, తిరుపతి ఆలయాల నిర్వహణ, పరిపాలన అత్యంత పవిత్రమైన బాధ్యత, అత్యంత నిష్ఠతో చేయాల్సిన బాధ్యత. అలాంటి టీటీడీ చైర్మన్ పదవిలో నిష్కలంక వ్యక్తిత్వం, అచంచల భక్తి, నిబద్ధత,... లడ్డూలో వాడే నెయ్యి విషయంలోనూ చంద్రబాబుది అదే నిర్లక్ష్యం. నెయ్యి క్వాలిటీ బాగోలేదని ఈ చంద్రబాబు హయాంలోనే టీటీడీ ల్యాబ్ తిప్పి పంపినా, మళ్లీ అవే క్వాలిటీ లేని నెయ్యి ట్యాంకర్లు, ఆయన హయాంలోనే వేరే వారి పేరిట తిరిగి టీటీడీకి రావడం, ఆయన హయాంలో వచ్చిన అవే ట్యాంకర్లను టీటీడీ అంగీకరించి, అనుమతించడం, అక్కడ నుంచి తిరుమల లడ్డూ తయారీలో వాడటం, ఇదే విషయాన్ని సీబీఐ-సిట్ మొదటి ఛార్జిషీటు 64, 91 పేజీల్లోనూ, ఫైనల్ ఛార్జిషీటు 44వ పేజీలోనూ చాలా స్పష్టంగా చెప్పింది. చంద్రబాబుకు దేవుడి పట్ల భక్తి లేదు, ఆలయాల నిర్వహణ పట్ల శ్రద్ధ అంతకన్నా లేదనడానికి ఇది మరొక ఉదాహరణ. ఈ రకంగా చంద్రబాబు.. తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో తప్పు చేసి, దాన్ని వేరొకరి మీదకు నెట్టి, మళ్లీ దానిమీద రాజకీయ దుమారం రేపుతూ, ఆ నెయ్యితోనే స్కాంలు చేస్తున్నాడు. మరోవైపు 2014-19 మధ్య టీటీడీ నెయ్యి కొనుగోలు ధర దాదాపుగా రూ.278-330గా ఉంది. 2019-24 మధ్య కూడా నెయ్యి సగటు రేటు దాదాపుగా అంతే. చంద్రబాబు తాను ముఖ్యమంత్రిగా ఉంటూ, నెయ్యి విషయంలో తప్పుడు ఆరోపణలు చేస్తూ, దానిపై రాజకీయ దుమారం రేపుతూ తన హెరిటేజ్‌కి చెందిన మానుఫ్యాక్చరింగ్ కంపెనీ, ఇందాపూర్ డెయిరీకి, కిలో నెయ్యి రూ.658లకు, 2025లో అమ్ముకునేందుకు కట్టబెట్టి, లాభాలు ఆర్జిస్తూ, స్కాంలు చేస్తూ టీటీడీకి నెయ్యి సరఫరాను తన సొంత ఆదాయ మార్గంగా మార్చుకున్నారు. ఆలయాల నిర్వహణలో చంద్రబాబుకు భక్తి లేదు, శ్రద్ధ లేదు, నిష్ఠ లేదు, నిజాయితీ అంతకన్నా లేదనడానికి ఇది మరొక ఉదాహరణ' అని పోస్టులో పేర్కొన్నారు.

# ఇరాన్ యుద్ధనౌక మునక..

ఎయిర్‌ఫోర్స్ విమానాలను పంపాం. ఈ నౌకలో 180 మంది ఉన్నట్లు సమాచారం. వారిలో దాదాపు 30 మందిని రక్షించాం" అని విదేశాంగ మంత్రి విజిత హెరాత్ పార్లమెంటుకు తెలిపారు. ఇజ్రాయెల్, అమెరికా దాడులు.. ఇరాన్ ప్రతిదాడులతో పశ్చిమాసియా అట్టుడుకున్న వేళ ఈ ఘటన ప్రాధాన్యం సంతరించుకుంది. నౌక ఎలా దెబ్బతింది? సిబ్బంది ఎలా గాయపడ్డారు? అనే వివరాలు తెలియరాలేదు. అయితే, ఈ నౌకపై జలాంతర్గామి దాడి జరిగిందని, 100 మందికిపైగా గల్లంతయ్యారని, 78 మంది గాయపడ్డారని అంతర్జాతీయ కథనాలు వెల్లడించాయి. 'ఐఆర్ఐఎస్ దేనా'.. ఇరాన్ కొత్త యుద్ధ నౌకల్లో ఒకటి. ప్రస్తుతం అమెరికా ఆంక్షల జాబితాలో ఉంది. ఇటీవల విశాఖ తీరంలో నిర్వహించిన విన్యాసాల్లో పాల్గొని, తిరుగు ప్రయాణంలో ఉండగా ఈ ఘటన జరిగినట్లు సమాచారం.

# అమెరికా నేవీ రక్షణ

రాసుకొచ్చారు. ఇక, గల్ఫ్ మీదుగా సముద్ర మార్గాల్లో జరిపే వాణిజ్యానికి ఆర్థిక భద్రత, అందుబాటు ధరల్లో బీమా, ఇతర గ్యారెంటీలన్నీ తక్షణమే అందించాలని యూఎస్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను ఆదేశించినట్లు ట్రంప్ వెల్లడించారు. ఈ ప్రకటన తర్వాత చమురు మార్కెట్లు స్వల్పంగా కోలుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ధర 73 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఇటీవల ఇది 80 డాలర్లకు పైనే ట్రేడ్ అయిన సంగతి తెలిసిందే. హర్మూజ్ జలసంధిని మూసివేస్తున్నామని, ఆ దిశగా నౌకలు వస్తే నిప్పు పెడతామని ఇరాన్ నిన్న హెచ్చరించింది. దీంతో ఈ మార్గంలో చమురు రవాణా స్తంభించింది. హర్మూజ్‌కు అటూఇటూ వందల సంఖ్యలో నౌకలు నిలిచిపోయినట్లు మారిటైమ్ అనలిటిక్స్ సంస్థల గణాంకాలు వెల్లడించాయి. ఈ క్రమంలోనే ట్రంప్ నుంచి ప్రకటన వెలువడటం ప్రాధాన్యం సంతరించుకుంది.

# విప్లవం అవసరం లేదు

లేదన్నారు. రాష్ట్రంలో నాయకత్వ మార్పుపై తానెప్పుడూ బహిరంగంగా ప్రకటనలు చేయలేదని శివకుమార్ అన్నారు. ఆ పదవి ఖాళీ అయినప్పుడే మరొకరికి అవకాశం వస్తుందన్నారు. కానీ అలా కావాలని తానెప్పుడూ కోరుకోలేదన్నారు. తాను ప్రజల కోసం పలు పోరాటాలు చేశానని.. కానీ పదవి కోసం ఎప్పుడూ పోరాడలేదని అన్నారు.

**మాది పాలు-తేనె వంటి బంధం: సిద్ధరామయ్య**

సీఎం స్థానం కోసం ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు మధ్య విభేదాలు నెలకొన్నట్లు వస్తున్న వార్తలను సిద్ధరామయ్య కొట్టిపడేశారు. అవన్నీ ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ఆరోపణలని అన్నారు. డీకే శివకుమార్‌కు మద్దతుగా ఉన్న ఎమ్మెల్యేల ఫోన్లను తాను ట్యాపింగ్ చేయించినట్లు విపక్ష నేత ఆర్.అశోక్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పాలు-తేనె వంటి తమ బంధాన్ని ఎలాగైనా నాశనం చేయాలనే ఉద్దేశంతోనే వారు తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు.

# మా పార్టీకి భావోద్వేగం

అన్ని జట్లను టీవీకే ఓడిస్తుంది. క్రికెట్‌లో తమిళనాడు సీఎస్కేకు విజిల్ వేస్తే.. ఈ ఎన్నికల్లో టీవీకే 'విజిల్' (టీవీకే పార్టీ గుర్తు) మారుమోగనుంది. ప్రజలకు ఉన్న అనుబంధాన్ని ఎవరూ విడగొట్టలేరు" అని విజయ్ అన్నారు. అలాగే పలు హామీలు ఇచ్చారు. తాము అధికారంలోకి వస్తే, రెండు ఎకరాలలోపు వ్యవసాయ భూమి ఉన్న రైతు బిడ్డల ఉన్నతవిద్యకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందన్నారు. అయితే ఆ కుటుంబాల్లో ఏ ఒక్కరికీ ప్రభుత్వ ఉద్యోగం ఉండకూడదన్నారు. ఉన్నత విద్యకోసం భారీగా ఖర్చు చేయలేని పేద కుటుంబాలకు సహకరించడమే తమ ఉద్దేశమన్నారు. మత్స్యకారుల కుటుంబాలకు రక్షణ కల్పిస్తామన్నారు. అవినీతికి పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఏడాది పొంగల్‌కు విడుదల కావాల్సిన విజయ్ చిత్రం 'జననాయగన్' న్యాయపరమైన చిక్కులతో ఆగిపోయింది. ఈ సభలో దానిగురించి ప్రస్తావించారు. " ఈ విషయంలో చాలామంది మద్దతుగా తమ గళాన్ని వినిపించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా వారిలో ఉన్నారు. ఆయనకు కృతజ్ఞతలు. అయితే ఆయన మద్దతు ఇచ్చినా.. పరిస్థితిలో మార్పు కనిపించలేదు" అని వ్యాఖ్యానించారు.

# బీసీలను అభివృద్ధి చేసిందీ మేమే

ఆమె స్పందించారు. 2014-19లో వడ్డెర్లకు, రజకులకు, మత్స్యకారులతో ఇతక బీసీ కులాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చామన్నారు. కూటమి ప్రభుత్వంలోనూ బీసీలకు పెద్దపీట వేస్తున్నామని, వారిని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని తెలిపారు. గతంలో ఆదరణ, ఆదరణ 2.0 పథకాలను ప్రారంభించిన ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. త్వరలో ప్రారంభించబోయే ఆదరణ 3.0లో వడ్డెర్లకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. వడ్డెర్లకు మైనింగ్ లీజు కేటాయింపుల్లో 15 శాతం రిజర్వేషన్లు, సీనరేజీలో 50 శాతం మినహాయింపు ఇచ్చే ఆలోచన చేస్తున్నామని, వాటికి సంబంధించిన ఫైళ్లు ఆర్థిక శాఖ వద్ద ఉన్నాయని తెలిపారు. సముద్రంలో చేపల వేట నిషేధం కాలంలో మత్స్యకారులకు(పల్లెకారులు) ఇచ్చే ఆర్థిక సాయం రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచిన విషయాన్ని మంత్రి సవిత గుర్తు చేశారు. ఇలా రాష్ట్రంలో ఉన్న 1.20 లక్షల మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తున్నామన్నారు. మత్స్య కారులు చేపల వేట సమయంలో ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.10 లక్షల వరకూ బీమా చెల్లిస్తున్నామన్నారు. మత్స్యకారుల మర పడవులకు వినియోగించే లీటర్ డీజిల్ పై రూ.9లు సబ్సిడీ ఇస్తున్నామన్నారు. మత్స్య కారుల పిల్లల కోసం ప్రత్యేక గురుకుల పాఠశాలలు నిర్వహిస్తున్నామన్నారు. మత్స్య కారుల పడవలు మరమ్మతులకు రూ.30 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు.

**ఆదరణ 3.0లో రజకులకు వాషింగ్ మెషిన్లు**

దేశంలో మొట్టమొదటిసారిగా 2014-19 మధ్య రజకల ఆర్థిక వృద్ధి కోసం ధోబి ఘాట్లు నిర్మించిన ఘనత సీఎం చంద్రబాబుదేని మంత్రి సవిత తెలిపారు. రాబోయే ఆదరణ 3.0 పథకంలోనూ రజకులకు వాషింగ్ మిషన్లు, ఆధునిక పరికరాలు అందజేయబోతున్నామన్నారు. వడ్డెర్లను, మత్స్యకారులను, రజకులను, వాల్మీకీలను ఎస్సీ, ఎస్టీ జాబితాలో చేర్చే అంశం పరిశీలిస్తున్నామని, ఆయా కమిటీల నివేదికలు రావాల్సి ఉందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ జాబితాలో కొత్త కులాలను చేర్చే అంశంపై తుది నిర్ణయం తీసుకోవాల్సింది కేంద్ర ప్రభుత్వమేనని, ఈ విషయం సభ్యులకు కూడా తెలుసని మంత్రి సవిత తెలిపారు.

**బీసీలకు జగన్ చేసింది శూన్యం**

వైసీపీ ప్రభుత్వ హయాంలో అయిదేళ్ల పాటు బీసీలకు జగన్ చేసిందేమీ లేదని మంత్రి సవిత స్పష్టంచేశారు. 2014-19 మధ్య ఆయా కులాలను ఎస్సీ, ఎస్టీ జాబితాల్లో చేర్చడానికి అధ్యయన కమిటీలను అప్పట్లో తమ ప్రభుత్వమే నియమించిందన్నారు. తరవాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆయా కమిటీలను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. వడ్డెర్లతో పాటు అన్ని బీసీ కులాలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దనున్నామన్నారు. బీసీలకు పునాదులు, వాళ్లకు అభివృద్ధి చేసిందీ తామేనని మంత్రి సవిత స్పష్టంచేశారు.

# ఇక 'రాష్ట్ర ఆర్థిక వృద్ధి యంత్రం'

పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించారని, దీనివల్ల ఇన్వెస్టర్లకు జీఎస్టీ, స్టాంప్ డ్యూటీ మినహాయింపులు, క్యాపిటల్ సబ్సిడీలు లభిస్తున్నాయని మంత్రి దుర్గేష్ తెలిపారు. ఈ క్రమంలో 20 నెలల కాలంలో 117 అవగాహన ఒప్పందాల ద్వారా రూ.19,693 కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. అందులో 27 ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ అనుమతులు లభించాయని తద్వారా 1,22,637 మంది యువతకు ఉద్యోగ అవకాశాలకు మార్గం ఏర్పడిందన్నారు.ప్రస్తుతం రూ.6681 కోట్ల విలువైన ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 5 ఏళ్లలో 50వేల గదులు ఏర్పాటు చేయాలని లక్ష్యం నిర్ణయించగా 2025-26 నాటికి 5,232 బ్రాండెడ్ స్టార్ కేటగిరీ గదుల నిర్మాణానికి అనుమతులు ఇచ్చామన్నారు. దేశవ్యాప్తంగా 11,272 రూమ్స్ ఏర్పాటైతే మూడింట ఒక వంతు హోటళ్లు ఏపీలోనే ఏర్పాటు కావడం కూటమి ప్రభుత్వంపై నమ్మకానికి నిదర్శనమని, ప్రభుత్వానికి దక్కిన గౌరవంగా అభివర్ణించారు. పర్యాటక శాఖను కేవలం వినోద సాధనంగా కాకుండా, రాష్ట్ర ఆర్థిక వృద్ధికి కీలకమైన 'గ్రోత్ ఇంజిన్'గా తీర్చిదిద్దామన్నారు. 2047 నాటికి ఏపీని గ్లోబల్ టూరిజం హబ్‌గా నిలబెట్టే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించడం కోసం విదేశీ పర్యాటకుల రాకలో టాప్ -10 రాష్ట్రాల్లో ఏపీని అగ్రపథాన నిలిపేందుకు కంకణబద్ధులై ఉన్నామన్నారు. విదేశీ పర్యాటకుల గమస్థానంగా ఏపీని తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు.దేశీయ పర్యాటకుల రాకలో ఏపీ 4వ స్థానంలో ఉందన్నారు.త్వరలోనే మొదటి రెండు స్థానాల్లో నిలబెట్టడమే తమ లక్ష్యమన్నారు. పర్యాటక రంగంలో అడ్వెంచర్ స్పోర్ట్స్ గైడ్ లైన్స్, హోమ్ స్టే మరియు బ్రెడ్, బ్రేక్ ఫాస్ట్, ఉపాధి, క్యారవాన్, ల్యాండ్ అలాట్ మెంట్ తదితర పాలసీ లతో వినూత్న ఆవిష్కరణలకు నాంది పలికామన్నారు.

# విస్మరించము.. నిర్లక్ష్యం చేయం..

సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన "చలో విజయవాడ" కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచీ చాలా పెద్ద సంఖ్యలో హాజరైన జర్నలిస్టులు మహాత్మాగాంధీ రోడ్డు రాఘవయ్య పార్క్ సెంటర్ నుండి తుమ్మలపల్లి కళాక్షేత్రం వరకు భారీ ర్యాలీ జరిగింది. అనంతరం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో "ఫెడరేషన్" రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకట్రావు అధ్యక్షతన సభ జరిగింది. రాష్ట్ర నాయకులు తెలిపిన ఆయా సమస్యలపై మంత్రి స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి యథాశక్తి కృషి చేస్తానని పేర్కొన్నారు. జర్నలిస్టుల ముఖ్య సమస్యలన్నింటినీ సీఎంతో చర్చించి పరిష్కరించే ప్రయత్నం చేస్తామన్నారు. "జర్నలిస్టులను విస్మరించం.. నిర్లక్ష్యం చేయం" అని తెలిపారు. జర్నలిస్టుల ఆరోగ్య బీమా పథకంలో అంతరం లేకుండా నిరవధికంగా కొనసాగేలా చూస్తానన్నారు. ఏడాదికి రెండుసార్లైనా జర్నలిస్టులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించాలన్న విజ్ఞప్తిని ప్రస్తావిస్తూ ఐఎంఏ, పెద్ద ఆసుపత్రుల యాజమాన్యాలతో చర్చించి జర్నలిస్టులకు లబ్ధి కలిగేలా చూస్తామన్నారు. జర్నలిస్టుల సంక్షేమ నిధిని పెంచి ఫలాలు అందేలా.. కార్యాచరణ ఆలోచిస్తామని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు. ఈ పథకానికి తాను వ్యక్తిగతంగా ఐదు లక్షల రూపాయలు అందజేస్తానన్నారు. జర్నలిస్టులకు ఇళ్లు.. ఇంటి స్థలాల అభ్యర్థనను ప్రస్తావిస్తూ ఈ వరకే ఉన్న పథకంలో జర్నలిస్టుల్ని కలిపే విషయం సానుకూలంగా పరిశీలిస్తామన్నారు. జర్నలిస్టులపై దాడుల్ని ఖండించి తీరతామన్నారు. జర్నలిస్టుల పిల్లలకు విద్యాసంస్థల్లో ఉచితంగా అసెంబ్లీలో ప్రతిపక్షం లేకున్నా.. మీడియాలో వస్తున్న వివిధ సమస్యలను ప్రభుత్వం చర్చిస్తుంటుందని మంత్రి తెలిపారు. సోషల్ మీడియా, యూట్యూబ్ లలో తరచూ ఫేక్ న్యూస్ వస్తున్నందున మిగతా జర్నలిస్టుల మీద కూడా కొంత విముఖత లేకపోలేదన్నారు. అబద్ధాల.. తప్పుడు వార్తల విషయంలో ఉపేక్షించబోమని స్పష్టంచేశారు. దేశంలో అన్ని రాష్ట్ర ప్రభుత్వాల కంటే ప్రజల సంక్షేమానికి ఎక్కువ మొత్తంలో కేటాయిస్తోంది ఆంధ్రప్రదేశేనని ఆయన చెప్పారు. "ఫెడరేషన్" ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు మాట్లాడుతూ "సేవ్ జర్నలిజం.. ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్" అని జర్నలిస్టుల జాతీయ సంఘం పేర్కొన్న అంశాన్ని తొలుత ప్రస్తావించారు. తమ సంఘంలో 7 వేల మందికి పైగా సభ్యులున్నారంటూ వారు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను వివరించారు. జర్నలిజం వృత్తి పెద్ద ప్రమాదంలో పడింది. జర్నలిస్టులకున్న కొద్దిపాటి చట్టాలను కూడా కేంద్రం రద్దు చేసింది. మాకు ఏ సదుపాయాలున్నాయో తెలియదు. జర్నలిస్టుల పరిస్థితులు అన్నింటినీ అధ్యయనం చేసేందుకు మీడియా కమిషన్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతో ఉంది అని ఆంజనేయులు పేర్కొన్నారు. తొలుత "ఫెడరేషన్" ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎం.బి.నాథన్ స్వాగతం పలుకుతూ రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ప్రధానంగా 14 సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు కలిమిశ్రీ నాయకులను వేదికపైకి ఆహ్వానించారు. "ఫెడరేషన్", ఏపీ బీజేఏ, ఎన్ఏజే నాయకులు కొండయ్య, అమరయ్య, గంట్ల శ్రీనుబాబు..ఎం. శ్రీనివాసరావు, మంజరి, శాంతిశ్రీ, ఇంకా ఆ సంఘాల జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు వేదికను అలంకరించారు. మంత్రికి ఆయా సమస్యలను వివరిస్తూ అ సంఘాల రాష్ట్ర నాయకులు వినతిపత్రం అందించారు. తొలుత "కళారత్న" నాట్యగురు భాగవతుల సౌమ్య శిష్యులు ప్రదర్శించిన నృత్యాలు ఆహూతుల్ని విశేషంగా అలరించాయి. సౌమ్యను మంత్రి ద్వారా సన్మానించారు. నర్తకీమణులకు సర్టిఫికెట్లు అందించారు. ప్రజానాట్యమండలి గాయకులు అనిల్, కవి, అప్పన్న పాడిన అభ్యుదయ గీతాలు అలరించాయి.

# ముందుకు సాగుదాం

అతీతంగా ప్రజాప్రతినిధులంతా కృషిచేద్దాం. ఇప్పటికే కొన్నిరాష్ట్రాలు ఏపీకి వచ్చి అధ్యయనం చేస్తున్నాయి. ఏపీ విద్యావ్యవస్థలో సంస్కరణలు, వన్ క్లాస్ వన్ టీచర్ విధానాలను అధ్యయనం చేయాలని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఇతర రాష్ట్రాలకు చెబుతున్నారు. ఇప్పటికే రెండు రాష్ట్రాల నుంచి ప్రతినిధి బృందం రాష్ట్రంలో విజిట్ చేశారు, మరికొందరు రాబోతున్నారు. ఇతర రాష్ట్రాలే కాదు, ఇతర దేశాలు కూడా ఏపీ విధానాలు చూసి అమలుచేసేలా తీర్చిదిద్దుతాం. విద్యాశాఖను ఒక బాధ్యతగా నేను నిర్వహిస్తున్నా. ఏ సమస్య తలెత్తినా వాట్సాప్ మెసేజ్ ద్వారా అభిప్రాయాలను సేకరిస్తున్నాం. కలిసికట్టుగా పనిచేసి బెస్ట్ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ తీసుకొద్దాం. విద్యావ్యవస్థలో ఆశించిన మార్పు కోసం కమిట్ మెంట్, పట్టుదలతో మనమంతా పనిచేయాల్సి ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థి సొంతబిడ్డలా భావించి, అక్కడి సమస్యలపై స్పందించాలి. ప్రభుత్వ పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు, గ్రంథాలయాల బలోపేతానికి పార్టీలకు అతీతంగా శాసనసభ్యులందరం పనిచేయాల్సి ఉంది. నైతికవిలువలతో కూడిన సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలి. తాము తీసుకునే నిర్ణయాల్లో తప్పులుంటే సరిదిద్దుకోవడానికి ప్రజాప్రభుత్వం సిద్ధంగా ఉంది, ప్రజల నుంచి కూడా ట్విట్టర్, ఇన్ స్టా, ఫేస్ బుక్, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా అభిప్రాయాలను స్వీకరిస్తున్నాం.

**ప్రతివారం ఎమ్మెల్యేలు పాఠశాలలను విజిట్ చేయండి**

ప్రతి శాసనసభ్యుడు మండలానికి రెండు పాఠశాలలను దత్తత తీసుకొని అక్కడ ఎన్ రోల్ మెంట్ రెట్టింపు చేయండి. ప్రతి నియోజకవర్గంలో ఒక్క పాఠశాలనైనా వెయ్యిమంది విద్యార్థులుండేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత సభ్యులందరిపై ఉంది. అందరం కలిసికట్టుగా విద్యావ్యవస్థను అభివృద్ధి చేయాలి, ఇది కేవలం ఒక్క మంత్రి వల్లనో, సెక్రటరీ వల్లనో సాధ్యం కాదు. అందరూ భాగస్వాములు కావాలి. ప్రతివారం ఒక ప్రభుత్వ పాఠశాలను విజిట్ చేసి, ఇన్ ఫ్రా, అటెండెన్స్, ఇతర అంశాలపై మాకు ఫీడ్ బ్యాక్ ఇవ్వండి. దీనిని ఫాం రూపంలో మాకు అందజేస్తే ఆయా పాఠశాలల్లో ఉన్న లోపాలను సరిదిద్ది, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి అవకాశం ఏర్పడుతుంది.

**డ్రాప్ బాక్సును దుర్వినియోగం చేశారు**

యువగళం పాదయాత్ర నాలో ఎంతో మార్పు తెచ్చింది. ప్రజలకు దగ్గరచేసింది, ప్రజల సమస్యలు అర్థం చేసుకునే అవకాశం కల్పించింది. 2019-24 నడుమ అన్నిరంగాల్లో మాదిరి విద్యాశాఖలో కూడా విధ్వంసం జరిగింది.

**అనాలోచిత చర్యలతో అధఃపాతాళానికి పడిపోయాం!**

కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసినప్పుడు భారతదేశంలోనే అతితక్కువ అక్షరాస్యత శాతం కలిగిన రాష్ట్రం ఆంధ్రపదేశ్ అని చెప్పారు. ఐదేళ్లపాటు అడల్ట్ లిటరసీ పైన, డ్రాప్ అవుట్స్ పెరిగిపోయి బీహార్ కన్నా తక్కువ లిటరసీకి పడిపోయాం. మూడేళ్లలో ఏపీని లిటరసీలో టాప్ - 5కి తీసుకువచ్చే బాధ్యత నాది అని హామీ ఇచ్చాను.

**టీచర్లను మందుషాపుల వద్ద కాపలాపెట్టారు**

గతంలో ఉపాధ్యాయులను వారు ఎలా అవమానించారో మనందరం చూశాం. టీచర్లను వైన్ షాపుల ముందు కాపలా పెట్టారు. గత ఐదేళ్లలో ఒక్క పోస్టు కూడా భర్తీచేయలేదు. స్కూళ్లలో మౌలిక సదుపాయాల సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. మేం వచ్చాక ప్రభుత్వ స్కూళ్లకు స్టార్ రేటింగ్ తెచ్చాం. వన్ స్టార్ లో 1725, 2స్టార్ లో 16,199 పాఠశాలలు ఉన్నాయి. వీటిని అప్ గ్రేడ్ చేయడానికి సుమారు రూ.7,800 కోట్లు అవసరం. ఈ సంవత్సరంలో రూ.1,200 కోట్లు కేటాయించి, పనులు ప్రారంభించడం జరిగింది. పిల్లలకు ఇచ్చే బెల్టు, బ్యాగుపై మాజీ ముఖ్యమంత్రి పేర్లు వేసుకున్నారు. టెక్స్ట్ బుక్ లో ముఖ్యమంత్రి, మంత్రి, ఉన్నతాధికారుల మెసేజ్ లు ముద్రించారు. వాటివల్లే సుమారు ఏటా ప్రభుత్వానికి సుమారు రూ.10కోట్ల నష్టం కలిగింది. వాటన్నింటినీ మేం వచ్చాక తొలగించడం జరిగింది. జీవో 117కి ప్రత్యామ్నాయం తీసుకొచ్చాం.

**లెర్నింగ్ అవుట్ కమ్స్‌పై ప్రత్యేకదృష్టి**

అభ్యసన ఫలితాలపై (లెర్నింగ్ అవుట్ కమ్స్) ప్రధానంగా దృష్టిసారించాం. ఎఫ్ ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ)పై ఎక్కువ శ్రద్ధ పెడుతున్నాం. నూరుశాతం అక్షరాస్యత సాధించేందుకు ఒక ప్రాజెక్టును తీసుకువచ్చాం. రాబోయే మూడేళ్లలో ఆ ప్రాజెక్టును పూర్తిచేస్తాం. పాఠశాలల్లో పిల్లలందరినీ ప్యాసివ్ లెర్నింగ్ నుంచి యాక్టివ్ లెర్నింగ్ కు మార్చేందుకు క్లిక్కర్ టెక్నాలజీ తీసుకువస్తున్నాం. పాఠశాలల్లో ఉపాధ్యాయుడు పాఠం చెప్పిన తర్వాత గేమిఫికేషన్ ద్వారా విద్యార్థుల నుంచి సమాధానం రాబట్టే టెక్నాలజీ ఇది. విద్యార్థులు ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారో తెలుసుకుని, ప్రతిరోజూ సాయంత్రం వారి తల్లిదండ్రుల ఫోన్ కి సమాచారం చేరవేస్తాం.

# ఎడిటర్ వాయిస్

## పంచాయతీలకు ఎన్నికల్లేవ్..! ఎందుకంటే?

త్వరలోనే గ్రామ పంచాయతీ ఎన్నికల గడువు సమీపిస్తోంది. దీనికి సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషన్ కూడా కసరత్తు ప్రారంబించింది. గ్రామీణ ప్రాంతాల్లో ఎంత మంది ఓటర్లు ఉన్నారు? ఎంతమంది అనర్హులు ఉన్నారు? అనే వివరాలను సేకరిస్తోంది. ఈ నెల 20 నాటికి ఈ కసరత్తు పూర్తి చేసి.. ఓటర్ల జాబితాల ను కూడా అందించేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తోంది. దీని ప్రకారం.. ఏప్రిల్ 2వ తేదీతో ముగి యనున్న పంచాయతీల గడువు ప్రకారం.. ఎన్నికలు నిర్వహించేందుకు రెడీ అవుతోంది.

కానీ, సర్కారు ఆలోచన వేరేగా ఉంది. ఏప్రిల్ 2కే గ్రామాల స్థాయిలో పాలనకు గడువు ముగిసిపోయినా.. ఈ ఎన్నికలకు బ్రేక్ ఇవ్వాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. దీనికి ప్రధానంగా రెండు కారణాలు ఉన్నా యని నాయకులు చెబుతున్నారు.

1) బీసీల కు రిజర్వేషన్: ప్రస్తుతం దీనిపై మిశ్రా కమిషన్ అధ్యయనం ప్రారంభమైంది. ఈ నివేదిక వచ్చాక.. ఎన్నికలకు వెళ్లనున్నారు. అయితే.. ఈ నివేదిక వచ్చేందుకు ఏప్రిల్ 20వ తేదీ వరకు గడువు ఉంది.

ఆ నివేదిక వచ్చిన తర్వాత.. ప్రభుత్వం అధ్యయనం చేసి.. అనంతరం.. ఎన్నికలకు వెళ్లనుంది. ఇది కొంత ఆలస్యం కానుంది. ఇక, ఇదేసమయంలో రిజర్వేషన్లపై ఎలానూ న్యాయపరమైన సమస్యలు వస్తాయి కాబట్టి.. వాటిని కూడా ఎదుర్కొని ముందుకు సాగాలని నిర్ణయించుకుంది. ఈ లోగానే.. జిల్లా పరిషత్ లకు కూడా గడువు తీరుతుంది. అప్పుడు ఇక్కడ కూడా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. దీంతో 2వ అంశంగా ముందు పరిషత్ ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించుకుంది.

ముందుగానే గ్రామీణ స్థాయిలో ఎన్నికలు నిర్వహిస్తే.. గ్రూపు రాజకీయాలకు అవకాశం ఇచ్చినట్టు అవుతుంది కాబట్టి.. పరిషత్ ఎన్నికలను నిర్వహిస్తే.. అది కూటమి పార్టీలకు మేలు చేస్తుందన్న ఆలోచన ఉంది. దీంతో ముందుగా పరిషత్ ఎన్నికలకు వెళ్లి.. ఇక్కడ భారీ విజయం నమోదు చేసుకోవడం ద్వారా.. ఆ తర్వాతే గ్రామీణ ఎన్నికలకు వెళ్లాలని భావిస్తోంది. సో.. మొత్తంగా గ్రామ ప్రంచాయతీ ఎన్నికలకు కొంత సమయం పట్టే అవకాశం కనిపిస్తోందని పార్టీలనాయకులు చెబుతున్నారు. ఈ విషయంపై ఇప్పటికే సీఎం చంద్రబాబుకు పలువురు నాయకులు తమ సూచనలు, సలహాలు ఇచ్చారని తెలిసింది.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైం వాయిస్

## ఊపిరి పోసిన అమ్మే ఉసురు తీసింది

### యాదాద్రి జిల్లా గొల్లగూడెంలో విషాదం – పిల్లల్ని చంపి తానూ బలవన్మరణం

### కుటుంబ కలహాలు, మెట్టినింటి వేధింపులే కారణమని లేఖ



**బీబీనగర్, విశ్వం వాయిస్ న్యూస్ :** 'నాన్నా.. మళ్లీ జన్మంటూ ఉంటే మీకు కొడుకులా పుడతాను. ఆడపిల్ల బతుకు వేస్ట్.. అత్తామామలు మీరిచ్చిన రూ.32 లక్షల కట్నం, 30 తులాల బంగారాన్నే చూశారు తప్ప నన్ను, నా పిల్లల్ని ఏనాడూ సరిగ్గా చూడ లేదు' అని లేఖ రాసిన మహిళ అభం శుభం ఎరుగని ఇద్దరు పిల్లల ఊపిరి తీసి తాను ఉరేసుకుంది. మెట్టినింటి వేధింపులే కారణమని సూసైడ్ నోట్‌లో పేర్కొంది. ఈ విషాద ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గొల్లగూడెంలో జరిగింది. భువనగిరి డీఎస్పీ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లగూడెం గ్రామానికి చెందిన మేకల మహేశ్‌కు వలిగొండ మండలం వేములకొండ గ్రామానికి చెందిన ఐశ్వర్య(28)తో నాలుగేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఝాన్సీ(2), పండు(10 నెలలు) ఇద్దరు పిల్లలు. ఏడాదిన్నర కిందట భార్య, భర్తలు ఒకరిపై ఒకరు అనుమానంతో గొడవ పడ్డారు. ఈ క్రమంలో ఐశ్వర్య సోదరులు ఘర్షణ పడి బావను వలిగొండ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి సోదరిని, ఆమె కుమార్తె ఝాన్సీని వెంట తీసుకెళ్లారు. అప్పుడు ఐశ్వర్య రెండు నెలల గర్భిణి. అప్పటి నుంచి తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. తనను కొట్టి అవమానించారని మహేశ్.. భార్య, బిడ్డను చూడటానికి ఎప్పుడూ వెళ్లలేదు. కుమారుడు పుట్టాడని తెలిసినా.. అటు వైపు చూడలేదు. మహేశ్ రైల్వేలో ట్రాక్‌మ్యాన్‌గా పనిచేస్తూ వికారాబాద్‌లోని శంకర్‌పల్లిలో నివాసముంటున్నాడు.

**అత్తారింటికి పంపించిన రోజే..**


ఐశ్వర్య పెద్దమ్మ, పెద్దనాన్నలు పిల్లలతో సహా ఆమెను సోమవారం గొల్లగూడెం తీసుకొచ్చి అత్తారింట్లో దించి వెళ్లారు. మహేశ్ విధుల్లో ఉన్నాడు. రాత్రి అందరూ భోజనం చేశాక ఆమె తన గదిలో పిల్లలతో కలిసి నిద్రపోయింది. మంగళవారం తెల్లవారుజామున అత్త సత్తమ్మ గది తలుపులు తీసి చూడగా ఐశ్వర్య చీరతో ఉరివేసుకొని, పిల్లలు మంచంపై విగతజీవులుగా పడి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఆ గదిలో సూసైడ్ నోట్ లభించిందని అత్తింటి వేధింపులు తాళలేకే పిల్లలను చంపి తానూ ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు అందులో పేర్కొన్నట్లు డీఎస్పీ రవీందర్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. 'నా చావుకు భర్త మహేశ్, అత్తామామలు సత్తమ్మ, నర్సింహ, ఆడపడుచులు కారణం. నాపై అనుమానం ఉంటే నా కుమారుడి డీఎన్ఏ చెక్ చేసుకోండి' అని ఐశ్వర్య సూసైడ్ నోట్‌లో పేర్కొంది.

## జూదంలో ఘర్షణ.. స్నేహితుడిపై కాల్పులు

**తుమ్మిందపాళ్యం, విశ్వం వాయిస్ న్యూస్ :** చిత్తూరు జిల్లాలో కాల్పుల కలకలం చోటుచేసుకుంది. తుమ్మిందపాళ్యంలో నాటు తుపాకీతో ఓ వ్యక్తి కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ఒకరు మృతి చెందారు. జూదం ఆడుతుండగా ఇద్దరు స్నేహితుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈక్రమంలో కోపోద్రిక్తుడైన డిల్లీ అనే వ్యక్తి తన దగ్గర ఉన్న నాటు తుపాకీతో సాయి కుమార్ (24)పై కాల్పులు జరిపాడు. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మేకను దొంగిలించారని కట్టేసి కొట్టారు

### ఇద్దరు విద్యార్థుల్లో ఒకరి మృతి – విద్యార్థులను తాడుతో కట్టేసిన గ్రామస్థులు



**రాయగడ పట్టణం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఒడిశాలోని మయూర్‌భంజ్ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. మేకను దొంగిలించారన్న ఆరోపణలపై ఇద్దరు విద్యార్థులను గ్రామస్థులు తాడుతో కట్టేసి దాడి చేయడంతో ఒకరు మృతి చెందారు. మరొకరు గాయపడ్డారు. ఈ అమానుష ఘటన తిరింగ్ పోలీస్‌స్టేషన్ పరిధి ఇందకోలిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. రాయిరంగపూర్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధి భూతుకబడికి చెందిన సంబిత్ బిందాని(15) బైసింగిలో మావయ్య ఇంట్లో ఉంటూ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. సంబిత్, మరో బాలుడు కలిసి మేకను దొంగిలించారన్న ఆరోపణలపై సమీప ఇందకోలి గ్రామంలో కొందరు వారిద్దరినీ తాడుతో కట్టేసి కొట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో రాయిరంగపూర్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే సంబిత్ మృతి చెందాడు.

## విడిపోయి సంతోషంగా ఉందని.. చంపేశాడు

### భార్య, ఆమె తల్లిని హత్య చేసిన ఉన్మాది

### తూర్పుగోదావరి జిల్లా బొబ్బిల్లంకలో ఘాతుకం



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** తనతో విడిపోయిన మహిళ అదే ప్రాంతంలో సంతోషంగా జీవనం సాగిస్తుండటాన్ని చూసి తట్టుకోలేకపోయాడు. ఆమె ముఖాన శాశ్వతంగా నవ్వు లేకుండా చేయాలనుకున్నాడు. వారం రోజులు రెక్కీ చేసి, స్నేహితులను వెంటబెట్టుకొని వెళ్లి మరీ కత్తితో దాడిచేసి ఆమెను చంపేశాడు. అడ్డొచ్చిన ఆమె తల్లినీ హతమార్చాడు. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం బొబ్బిల్లంకకు చెందిన సోడదాసి సీతారామరాజు(పండు) అదే గ్రామానికి చెందిన లత(31)ను పదహారేళ్ల క్రితం ప్రేమించి, పెళ్లి చేసుకున్నాడు. వీరికి ముగ్గురు సంతానం. భార్యభర్తలు తరచూ గొడవలు పడుతుండేవారు. ఈ క్రమంలో 8 నెలల కిందట పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి విడిపోయారు. ఆ తర్వాత సీతారామరాజు మరో పెళ్లి చేసుకున్నాడు. లత కూడా కొన్ని రోజులు బంధువుల ఇంటికి వెళ్లి బొబ్బిల్లంకలోని తల్లిగారింటికి ఇటీవలే వచ్చారు. కానీ, ఇద్దరి ఇళ్లూ ఒకే వీధిలో ఉండటంతో తరచూ తారసపడేవారు. లత రోజువారీ పనులకు వెళ్లడం, తల్లి, సోదరులతో కలిసి ఆనందంగా ఉండటాన్ని సీతారామరాజు చూసి జీర్ణించుకోలేకపోయాడు. ఎలాగైనా ఆమెను చంపాలని వారం రోజులు యత్నించాడు. చివరికి సోమవారం అర్ధరాత్రి ఇంటికి వెళ్లి కత్తితో ఆమెపై దాడి చేసి హతమార్చాడు. బాధితురాలి కేకలు విని ఆమె తల్లి గుమ్మడి లక్ష్మి(50) వచ్చి అడ్డుకోగా ఆమెనూ కత్తితో పొడిచి చంపాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మంగళవారం ఉదయం ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించారు. నిందితుడు, అతనికి సహకరించిన మరో ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఫైనాన్స్ వ్యాపారం చేసే నిందితుడు పాత నేరస్థుడు. అతనిపై ఓ హత్య కేసు, పోక్సో, పలు కొట్లాట కేసులూ ఉన్నాయి. ఘటనా స్థలాన్ని ఇన్‌ఛార్జి డీఎస్పీ రామకృష్ణ, కోరుకొండ సీఐ ఎస్‌వీఎస్ఎస్ మూర్తి, ఎస్సై రామ్‌కుమార్ పరిశీలించారు.

## చెరువులో పడి ముగ్గురు విద్యార్థుల మృతి

### హోలీ రంగులు కడుక్కోవడానికి వెళ్లినప్పుడు ఘటన



**గన్నవరం గ్రామీణం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడి ముగ్గురు విద్యార్థులు మృతిచెందారు. ఈ ఘటన కృష్ణా జిల్లా గన్నవరం మండలం చిక్కవరం శివారు కండ్రికలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బోళ్ల మోహన్‌సాయి (16), ముచ్చు వెంకట జోసఫ్ (16), దుప్పుల వినయ్‌కుమార్ (12) గొల్లనపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు హోలీ రంగులు చల్లుకుని.. తర్వాత శుభ్రం చేసుకునేందుకు సుందరి చెరువు వద్దకు వెళ్లారు. ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడ్డారు. ఎంతసేపటికీ రాకపోవడంతో రాత్రి 7 గంటల సమయంలో తల్లిదండ్రులు ఆరా తీయగా చెరువు వద్దకు వెళ్లినట్లు గ్రామస్థులు చెప్పారు. చెరువులో గాలింపు చేపట్టగా తొలుత వినయ్‌కుమార్, వెంకట జోసఫ్‌ల మృతదేహాలను, రాత్రి 10:30 గంటలకు మోహన్‌సాయి మృతదేహాన్ని గుర్తించారు. కుమారులు కళ్లముందు విగతజీవులుగా పడి ఉండడంతో తల్లిదండ్రుల రోదన చూపరులను కంటతడి పెట్టించింది.

# ఆమె నడిపిస్తోంది..






ఏదైనా పని చేయాలనుకున్నప్పుడు ఫలితం ఎలా ఉన్నా... ప్రయత్నం బాగుంటే అదో పాఠం అవుతుందని భావిస్తారు కొందరు. రాధిక బెహరా ఈ కోవకు చెందిన వారే. 'ఫెమీ రైడ్స్' ద్వారా రవాణా రంగంలో విప్లవాత్మక మార్పుకోసం ఐదేళ్లుగా ప్రయత్నిస్తున్నారీమె. చిన్నప్పట్నుంచీ సవాళ్లంటే ఇష్టం ఆమెకు. సొంతంగా ఏదైనా చేయాలి... తల్లిదండ్రులకు చేయూతగా ఉండాలని కోరుకునేవారు. కానీ చిన్నవయసులోనే పెళ్లి... ఇద్దరు పిల్లలు. పదేళ్లు ఇంటి బాధ్యతలతోనే గడిచిపోయింది. భర్తదీ చిన్న ఉద్యోగమే. అయినా రాధిక బయటకు వెళ్లి ఇబ్బందులు పడటం ఇష్టం లేదాయనకు. అందుకే చదువుకైతే ఒప్పుకొన్నారు కానీ... ఉద్యోగం వద్దన్నారట. కానీ పిల్లలకి చదువుకునే వయసొచ్చాక... ఆమె కలలకి రెక్కలు తొడిగే అవకాశం వచ్చిందంటారామె. 'ఇంట్లో అందరికీ సంగీతం అంటే ఇష్టం. అందుకే పిల్లలిద్దర్నీ మ్యూజిక్ క్లాస్‌లో చేర్చాను. వాళ్లతోపాటూ నేనూ నేర్చుకునేదాన్ని. అదే నా జీవితంలో టర్నింగ్ పాయింట్ అయ్యింది. సంగీతం టీచర్‌గా కెరియర్ ప్రారంభించా'అనే రాధికది విశాఖపట్నంలోని సింహాచలం. తర్వాత కుటుంబ పరిస్థితుల రీత్యా ఇంట్లోనే మ్యూజిక్, డ్యాన్స్, టైలరింగ్, మగ్గం పనులు నేర్పేవారు. తర్వాత ప్రభుత్వ పాఠశాలలో, ఓ ఎన్జీఓలో పనిచేశారీమె. అదే ఫెమీ రైడ్స్‌కు కారణమైంది అంటారు రాధిక.

**విఫలమైనా వదలకుండా...**

'ఎన్జీఓకు పనిచేస్తున్నప్పుడే పరిచయాలు పెరిగాయి. మహిళలు పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్నా. ఎన్జీఓ ద్వారా వాళ్లకోసం ఏదైనా చేయాలనుకున్నా. ఈ క్రమంలోనే నాన్నను చూడాలని హైదరాబాద్‌కు వెళ్లా. ఇద్దరు ఆడపిల్లలతో, ఒక్కదాన్నే క్యాబ్ బుక్ చేసుకుని ఇంటికి బయలుదేరా. ఆ రోజు నేను పడ్డ భయం ఎప్పటికీ మరచిపోలేను. ఒక్కసారికే నా పరిస్థితి ఇలా ఉంటే... రోజూ వందల మంది అమ్మాయిలు ఎన్నిసార్లు ఇలా భయపడుతున్నారో అనిపించింది. అప్పుడే తెలంగాణలో షీక్యాబ్స్ ప్రారంభమయ్యాయి. అయితే అనతికాలంలోనే అవి విఫలమైనట్లు విన్నా. తెలిసిన వాళ్ల ద్వారా కారణం తెలుసుకోవడానికి ప్రయత్నించా. సంస్థాగత, నిర్వహణ, నైపుణ్యాల కొరత కారణాలని తెలిసింది. మహిళా డ్రైవర్లంటే ప్రయాణికులు ఎక్కడానికే భయపడేవారు. అందుకే హైదరాబాద్‌లో ఆ ప్రాజెక్టు విఫలమైందని విన్నాను' అని గుర్తుచేసుకుంటారు రాధిక. ఇవేవీ పరిష్కరించలేనివి కాదు. కాస్త సమయం ఎక్కువ పట్టొచ్చు కానీ శిక్షణ ఇస్తే, మహిళలూ ఈ రంగంలో రాణించగలరన్న నమ్మకంతో ముందడుగు వేశారామె.

**సమయం వృథా అన్నారు...**

'డీపీఆర్(డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు) సమావేశంలో నా ఆలోచన చెప్పినప్పుడు సమయం వృథా తప్ప ఉపయోగం ఉండదు అన్నారు. కానీ మహిళలకు చేయూత దొరుకుతుందంటే ప్రయత్నించి చూడమన్నారు. నా స్నేహితురాలు ఒకామె... 'ఎన్జీఓకు మాత్రమే పరిమితం చేయకు. దీనివల్ల మహిళలకు చాలా ఉపయోగం ఉంటుంది. ఒక బిజినెస్ ప్లాన్‌గా తీర్చిదిద్దు' అంది. 2021లో ఫెమీ రైడ్స్ ప్రారంభించా. మహిళల కోసం... మహిళలే డ్రైవర్లుగా మారారిక్కడ. గులాబీ రంగును థీమ్‌గా ఎంపిక చేసుకున్నా. మంచి ప్రయత్నం అన్నారు కానీ... ఫెయిలైంది. నమ్మకం లేకపోవడం, మహిళా డ్రైవర్లంటే చిన్నచూపు ఇలా రకరకాల కారణాలు. తర్వాత పూర్తి శిక్షణతో క్షేత్రస్థాయిలోకి వస్తున్నాం అన్నప్పటికి లోన్లు ఇచ్చేవాళ్లు దొరకలేదు. సిబిల్ స్కోర్ ఇష్యూస్ వచ్చాయి. అలా మూడుసార్లు విఫలమైనా... వెనకడుగు వేయకుండా నడిపిస్తున్నా. ఇప్పుడు మా దగ్గర శిక్షణ తీసుకుని పనికి సిద్ధమైన వాళ్లకి కార్లు, బైక్లు రిపేర్‌తో సహా... ప్రాథమిక చికిత్స కూడా నేర్పుతున్నాం. అన్నింట్లో అర్హత సంపాదించుకున్నాకే రైడ్స్‌కు పంపుతున్నాం. స్థానికంగా మా వాహనాలు, డ్రైవర్లు అందుబాటులోకి వచ్చినా... దీనిద్వారా ఈ మహిళలంతా పూర్తిస్థాయిలో స్వయం ఉపాధి పొందినప్పుడే నేను విజయవంతమైనట్లు' అంటారు రాధిక. ఇటీవల కొన్ని కారణాల వల్ల థీమ్ కలర్‌ను ఊదాగా మార్చుకున్నారు.

# సక్సెస్ వాయిస్

## విద్య... అందరికీ చేరువ కావాలి



సమాజంలో విద్య... గౌరవం... అందరికీ సమానంగా దొరకడం లేదు. ఈ అసమానతలు తగ్గించి అందరికీ వాటిని చేరువ చేయాలంటారు షాహీన్ మిస్త్రీ. ఆ లక్ష్యంతో 'టీచ్ ఫర్ ఇండియా'ని మొదలుపెట్టి పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తున్నారు. ఈ క్రమంలో ఆమె ఎన్నో అవార్డుల్నీ అందుకున్నారు. షాహీన్ ముంబయిలో పుట్టినప్పటికీ తండ్రి ఉద్యోగ రీత్యా ఆమె బాల్యమంతా విదేశాల్లోనే గడిచింది. 18ఏళ్ల వయసులో ఇండియాకి వచ్చి ముంబయి విశ్వవిద్యాలయంలో సోషియాలజీలో బీఏ పూర్తిచేశారు. ముంబయి మురకివాడల్లో ప్రజల్ని గమనించిన ఆమె వారి జీవితాల్లో మార్పు తేవాలనుకున్నారు. 'విద్యతో మాత్రమే వాళ్ల జీవితాల్ని మార్చాలనుకున్నా. కుటుంబంలో ఒక్కరు చదువుకున్నా సమాజంలో పెద్ద మార్పే వస్తుంది. అందుకే వాళ్లకు చదువు చెప్పాలనుకున్నా' అంటారు షాహీన్. ఇందుకు 1989లో ఆకాంక్ష ఫౌండేషన్‌ని మొదలుపెట్టారు. కాలేజీ అయ్యాక మురికివాడలకు వెళ్లి అక్కడి పిల్లలకు పాఠాలు చెప్పేవారు. 15 మంది పిల్లలతో దీన్ని మొదలుపెట్టారు షాహీన్. ఆర్థికంగా వెనకబడిన పేద విద్యార్థులకు విద్యను అందించడమే దీని ప్రధాన ఉద్దేశం. తన ఆశయం నచ్చడంతో ఆమె స్నేహితులు కూడా తనతో చేయి కలిపారు. నెమ్మదిగా విద్యార్థుల సంఖ్యా పెరిగింది. అయితే దీన్ని ముంబయికి మాత్రమే పరిమితం చేయాలనుకోలేదు షాహీన్. ఎక్కువ మంది విద్యార్థులకు చేరువ చేయాలనుకున్నారు. దానికోసం దేశం మొత్తమ్మీదా ఎనిమిది నగరాల్లో 900 సహచరులు, 250 మంది సిబ్బందితో 2008లో 'టీచ్ ఫర్ ఇండియా'ని స్థాపించారు. ఇప్పటి వరకూ పది లక్షల మంది ప్రత్యక్షంగా, 33లక్షల మంది విద్యార్థులకు పరోక్షంగా విద్యను అందించారు. 'గ్రామంలో ప్రతి చిన్నారి చదువుకోవాలి' అనే షాహీన్ టీఎఫ్ఐఎక్స్.టీచ్ ఫర్ ఇండియా.ఆర్గ్ వెబ్‌సైట్‌ను రూపొందించారు. ఇదొక ఇంక్యుబేషన్ ప్రోగ్రామ్. దీంతో గ్రామీణ ప్రాంతాలకు చదువును చేరువ చేస్తున్నారు. దీంట్లో పిల్లలు పాఠాలను వాళ్ల ప్రాంతీయ భాషల్లో వినొచ్చు. వివిధ ఆమె చేసిన సేవలకిగాను అశోక ఫెలో, బియాండ్ బిజినెస్, ఈటీ ప్రైమ్ ఉమెన్ లీడర్‌షిప్ అవార్డులతోపాటు పలు ప్రశంసలూ అందుకున్నారు.

### గోదావరి ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్

# నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం

## కార్యక్రమంలో మాజీ ఎంపీ భరత్, యూనియన్ నాయకులు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నిర్మాణంలో ఉన్న శ్రామిక భవనాన్ని వెంటనే పూర్తి చేసి శ్రామికులకు అప్పగించకుంటే హైకోర్టును ఆశ్రయిస్తామని మాజీ ఎంపీ మార్గాని భరత్ పేర్కొన్నారు. బుధవారం రాజమండ్రి క్వారీ మార్కెట్ సెంటర్ లో ఉన్న శ్రామిక భవనం వద్ద గోదావరి ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన కార్యవర్గంలో అధ్యక్షులుగా ఎన్నికైన బొజ్జ రామకృష్ణకు, కార్యదర్శిగా ఎన్నికైన శ్రీనివాస్ లకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. తన హయాంలో శ్రామిక భవనం నిర్మాణానికి 1800 గజాల స్థలానికి కేటాయించి, భవన నిర్మాణానికి రూ 1కోటి రూపాయలు మంజూరు చేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికయి 2 సంవత్సరాలు కావస్తున్నప్పటికీ శ్రామిక భవనం నిర్మాణం చేయకపోగా శ్రామికులపై నిందలు వేస్తుందని విమర్శించారు. ఈ భవనం నిర్మాణం యోగ్యం కాదని అంటున్నారని తాను ప్రభుత్వానికి సూటిగా ప్రశ్నిస్తున్నాను అని భవనానికి అనుకునే అన్నా కాంటీన్ ఉందని, దానికి స్లాబ్ వేశారని, శ్రామిక భవనానికి కూడా స్లాబ్ వేయవచ్చు కదా అని ప్రశ్నించారు. శ్రామిక భవనం నిర్మాణానికి జి ప్లస్ టు నిర్మించుకునేందుకు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పర్మిషన్ ఇచ్చారని తెలి పారు. బిల్డింగ్ కట్టడానికి పనికి రానప్పుడు పర్మిషన్ ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. అనుమతించిన అధికారుల పై కేసులు నమోదు చేసి, ఉద్యోగాల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. శ్రామికుల పొట్టకొట్టడానికి కూటం ప్రయత్నిస్తుందని పేర్కొన్నారు. శ్రామిక భవనం నిర్మాణానికి 2 సంవత్సరాల కాలం ఎందుకు పట్టిందని, ఎవడబ్బ సొమ్ముతో భవనం నిర్మాణం చేస్తున్నారని ప్రశ్నించారు. శ్రామిక భవనం నిర్మాణం లో జాప్యం జరగడం వల్ల శ్రామికులు నడిరోడ్డు మీద నిలబడవలసి వస్తుందని అన్నారు. శ్రామిక భవనం వెంటనే నిర్మించకపోతే హైకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. గోదావరి ఎలక్ట్రికల్స్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు బొజ్జ రామకృష్ణ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన గోదావరి ఎలక్ట్రికల్స్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ 2026 నుంచి 2028 వరకు నూతన కార్యవర్గం పనిచేస్తుందని తెలిపారు నూతన కార్యవర్గాన్ని ప్రమాణస్వీకారం చేసేందుకు మాజీ ఎంపీ భరత్ రామ్ రావడం ఆనందదాయకమని అన్నారు శ్రామిక భవనం వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. శ్రామికులకు ఈఎస్ఐ ప్రతిపాదన చేసిన ఏకైక సంస్థ గోదావరి ఎలక్ట్రికల్స్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ మాత్రమేనని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రామికులకు 4 వరాలు ప్రకటించారని అయితే అవి మార్చి1వ తేదీ నుంచి ఆ పథకాల ప్రారంభిస్తామని చెప్పడం దారుణమని అన్నారు. గతంలో మృతి చెందిన శ్రామికులు, వివాహం చేసుకున్న వారు, ప్రమాదాలలో గాయాలు పడిన శ్రామికులు భీమా సౌకర్యం కోల్పోతారని అన్నారు. రాష్ట్రంలో శ్రామికులకు సంబంధించిన 46 లక్షలు క్లైములు పరిష్కారం కాలేదని ఆందోళన వ్యక్తం చేశారు.ఏ రాష్ట్రంలో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేశారని అయితే సంక్షేమ బోర్డు చైర్మన్ డైరెక్టర్లను ఇంకా నియమించలేదని వివరించారు. రాజమహేంద్రవరంలో శ్రామిక భవనం నిర్మాణంలో జాప్యం జరగడం వల్ల కార్మికులు నడిరోడ్డు మీద నిలబడవలసి వస్తుందని అన్నారు. కార్మికుల పట్ల పక్షపాతం వీడి శ్రామిక భవనం జి ప్లస్ టు ను వెంటనే నిర్మించి శ్రామికులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. శ్రామిక భవన్ వెంటనే నిర్మించుకుంటే మార్చి 20వ తేదీ నుంచి శ్రామిక భవనం వద్ద అన్ని కార్మిక సంఘాలతో కలిసి అర్ధనగ్న నిరసన కార్యక్రమం చేపడుతామని హెచ్చరించారు.

**నూతన కమిటీ సభ్యులు ప్రకటన**

గౌరవ సలహాదారులు బోర వెంకట గోపాలకృష్ణారెడ్డి, అధ్యక్షుడు బొజ్జ రామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ వీరవల్లి గంగాచార్యులు,సెక్రటరీ: ఆశపు శ్రీనివాస్ (బుజ్జి), జాయింట్ సెక్రెటరీ గోవాడ కొండబాబు ,ట్రెజరర్: సార్వకోట లక్ష్మణరావు, జాయింట్ ట్రెజరర్ సుదర్శన్ షణ్ముగం,స్టాండింగ్ కమిటీ చైర్మన్ ఆముదాలపల్లి కామేశ్వర రావు,ఆర్గనైజింగ్ కమిటీ సెక్రటరీ సిమల వీరభద్ర రావు,కన్వీనర్: గొలగాని విజయ్ భాస్కర్, కమిటీ చైర్మన్ పాలపర్తి అప్పారావు, కమిటీ మెంబర్ లు: చందు, ఊర్ల శ్రీరాములు,గొల్ల రవి,నీలాద్రి సురేష్ కుమార్, నిమ్మలపూడి రవి వర్మ,బల్ల హేమంత్, జనిపే పూర్ణచంద్రరావు, గద్దం ప్రసన్నకుమార్, పోలిపల్లి విజయ్ కుమార్, దల్లి నాగబాబు ప్రమాణ స్వీకారం చేశారు.

# నరసన్నను దర్శించుకున్న మాజీ ఈవో మారిశెట్టి జితేంద్ర

### ఆలయ అర్చకులు వేద ఆశీస్సులు



**కొవ్వూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని అన్నవరం దేవస్థానం మాజీ ఈవో మారిశెట్టి జితేంద్ర స్వామివారి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం జితేంద్ర స్వామి వారి దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. జితేంద్రకు ఆలయ అర్చకులు వేద ఆశీస్సులు అందజేశారు. జితేంద్ర కోరుకొండ తాసిల్దార్ గా నిరుపేదలకు విశిష్ట సేవలు అందించి, పలువురు మన్నలను పొందారు. కోరుకొండ ప్రజలతో మంచి సత్సంబంధాలు ఉన్న జితేంద్రను పలువురు ఆప్యాయతగా పలకరిస్తూ, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. జితేంద్ర ఆర్డీవో, అన్నవరం దేవస్థానం ఈవోగా సేవలు అందించి విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు చంటిబాబు, శ్రీనివాస్ రెడ్డి, పశ్చిమ గోనగూడెం సర్పంచ్ తెలుగుదేశం పార్టీ నాయకులు రొంగల దేవిక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నరసన్నకు వైభవంగా శ్రీ పుష్ప యాగం



**కొవ్వూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణ మహోత్సవాలు ముగింపు సందర్భంగా స్వామి అమ్మవార్లకు శ్రీ పుష్ప యాగాన్ని వైభవంగా నిర్వహించారు. బుధవారం నరసన్న కళ్యాణ మహోత్సవాలు ముగింపు పురస్కరించుకొని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎస్వి రంగరాజ బట్టర్ ఆధ్వర్యంలో వేద పండితులు శ్రీమాన్ పాణింగ పల్లి పవన్ కుమార్ ఆచార్యులు స్వామివారికి వివిధ ఫల, పుష్పాలను సమర్పించి శ్రీ పుష్ప యాగాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను పల్లకి పై వేయింపజేసి వివిధ రకాల వాయిద్యాలతో నరసన్న నామస్మరణలతో ద్వాదశ ప్రదక్షిణలు గావించారు. అనంతరం యావన్మంది భక్తులు స్వామి అమ్మవార్లు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు పవన్ కుమార్ ఆచార్యులు, పెద్దింటి చంటిబాబు, సంతోష్, గిరిధర్, యావన్మంది భక్తులు పాల్గొన్నారు.

# బాలల పరిరక్షణ చట్టాలపై శిక్షణా కార్యక్రమం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమండ్రి అర్బన్ ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీ పీఓ యు.పద్మావతి ఆధ్వర్యంలో గ్రామస్థాయి, వార్డుస్థాయి,మండలస్థాయి బాలల సంరక్షణ, పర్యవేక్షణ కమిటీ సభ్యులకు బాలల పరిరక్షణ చట్టాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మిషన్ వాత్సల్య పథకం బాలల పరిరక్షణకు చట్టాలు రూపొందించారని డీసీపీజీ యూనిట్ కౌన్సిలర్ అభిషాలోమ్ చెప్పారు.డీసీపీజీ క్రాంతిలాల్ మాట్లాడుతూ బాలల పరిరక్షణ చట్టాలు,బాలల హక్కులు దుర్వినియోగం, లైంగిక వేధింపుల నుంచి రక్షించడానికి రూపొందించారని చెప్పారు. బాలల హక్కుల రక్షణ చట్టం లైంగిక, ట్రాఫికింగ్ నిషేధం,జీవన రక్షణ, అభివృద్ధి, హక్కులు కల్పిస్తుందన్నారు. లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించేందుకు ఫోక్సో చట్టమని తెలిపారు. బాలకార్మికులతో వెట్టి చాకిరి చేయిస్తే 6 నెలల నుంచి రెండేళ్ళ వరకు జైలు శిక్ష, రూ.20 వేలు నుంచి రూ.50 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని తెలిపారు. మిషన్ వాత్సల్య పథకం గురించి వివరించారు.ముఖ్య అతిధిగా ప్రజెక్టు డైరెక్టర్ శ్రీదేవి పాల్గొన్నారు. వార్డు స్థాయి కమిటీ సభ్యులు, మహిళా కార్యదర్శులు, ఎఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు, స్కూలు టీచర్లు, వీఓలు, వీఆర్వోలు, వార్డు మెంబర్లు ఈ శిక్షాణా కార్యక్రమంలో పాల్గొన్నారు. సూపర్వైజర్లు ఆర్.బేబీరాణి, బి.వరలక్ష్మి, మోషన లక్ష్మి పాల్గొన్నారు.

**ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు**

ఐసీడీఎస్ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్తలకు వ్యాసరచన పోటీలు నిర్వహించి 10 మంది విజేతలకు బహుమతులు అందచేశారు. మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేస్తున్నారని, విద్య, ఉద్యోగం, కుటుంబం, బాధ్యతలు కలిగి ఉంటున్న వారి గురించి వివరించారు.

### అసాంఘిక కార్యక్రమాలకు

# నిలయంగా మారుతున్న అర్బన్ హెల్త్ సెంటర్



### హెచ్‌డీఎస్ కమిటి చైర్మన్ మందపల్లి రవికుమార్

**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట పట్టణ పరిధిలో ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఉన్నా మండపేట అర్బన్ హెల్త్ సెంటర్ లో రాత్రి సమయం లో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారిందని మండపేట ఎనిమిది వార్డు కౌన్సిలర్, హెచ్ డీ ఎస్ కమిటి చైర్మన్ మందపల్లి రవికుమార్ ఆరోపించారు. రవి ఆధ్వర్యంలో అర్బన్ హెల్త్ సెంటర్‌లో హెచ్‌డీసి కమిటి సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రి సమయంలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని వాటిని అరికట్టాలని పోలీస్ శాఖ కు విజ్ఞప్తి చేశారు. ఈ హాస్పిటల్ కు కాంపౌండ్ వాల్ తక్షణం నిర్మించాలని డిమాండ్ చేశారు. హాస్పిటల్ వెనుక గోడకు గేట్ ఏర్పాటు చేయాలని చెప్పారు.సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి హాస్పిటల్ కు తెచ్చిన మందులు నిల్వ ఉంచేందుకు గదులు సరిపోవడం లేదన్నారు. యుపిహెచ్ హాస్పిటల్ పై అంతస్తులో భవనం నిర్మాణం చేపట్టాలనీ కోరారు. ప్రభుత్వం నూతనంగా నిర్మించిన బాత్ రూమ్‌కి హాస్పిటల్ లోపల నుంచి మార్గం ఏర్పాటు చేయాలన్నారు. దీనిపై సమావేశం చేసిన తీర్మానాలు జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, కమీషనర్ టీవీ రంగారావు లకు అందజేసినట్లు రవి కుమార్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మెడికల్ ఆఫీసర్ కే రమ్య లక్ష్మీ, కమిటీ సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు స్టీల్ కంచాలు బహుకరణ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక నెహ్రూనగర్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల నందు ఉన్న విద్యార్థులకు గేదల విక్రాంత్, జయశ్రీ దంపతుల కుమార్తె చిరంజీవి జస్విక ఐదవ పుట్టినరోజు సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కోశాధికారి డాక్టర్ జి.మహాలక్ష్మి, సీపీఅండ్ పీహెచ్పీ వెల్ఫేర్ అసోసియేషన్(పీఎంపీ అసోసియేషన్) జిల్లా అధ్యక్షులు,రెడ్ క్రాస్ జిల్లా ఎమ్సీ సభ్యులు బళ్ళా శ్రీనివాసరావుల చేతుల మీదుగా వంద స్టీల్ కంచాలు అందచేసారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.ఆశాకిరణ్, పట్టా బాపూజీ, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులను పరామర్శించిన మాజీ ఎంపీ భరత్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యుత్ ఘతానికి గురి అయ్యి ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న ఇద్దరు స్కూలు విద్యార్థులను వైసిపి మాజీ ఎంపీ మార్గాని భరత్ పరామర్శించారు. రాజమండ్రి సిటీ, అనుశ్రీ థియేటర్ వద్ద గల ట్రైనింగ్ కాలేజీ ప్రాంగణంలో ఉన్న స్కూల్ లో తొమ్మిదవ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు విద్యుత్ ఘాతానికి గురయ్యారని తెలిసిన వెంటనే పీత రామకృష్ణ బృందానికి తెలియపరచగా వాళ్ళు వివరాలు సేకరించి తెలియపరిస్తే వచ్చి ఇక్కడ దానవాయిపేట సురక్ష హాస్పిటల్ నందు 15వ వార్డు కు చెందిన యన్ రమేష్, దివాన్ చెరువు కేశవ హాస్పిటల్ నందు 27 వ వార్డు కు చెందిన ఉజ్వల ఈశ్వర సాయి చికిత్స పొందుతున్నారు. స్కూల్ జరుగుతున్న సమయంలో ఇద్దరు పిల్లలు మామిడికాయలు కోయడానికి బయటకు వచ్చి అధ్యాపకులు తిడతారని గోడ దూకే క్రమంలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ షాక్ కు గురి అయ్యి తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. విద్యా శాఖ అధికారులు వచ్చి తలొక పది వేల రూపాయలు వైద్య ఖర్చులకు ఇచ్చి వెళ్లిపోయారని బాధిత తల్లి తండ్రులు చెపుతున్నారు. ఇక్కడ వీళ్ల పరిస్తితి ఎంత దారుణం అంటే ప్రైవేట్ ప్రదేశాలలో కూడా గాయాలయ్యి చికిత్స పొందుతున్నారు, మేము ప్రతిపక్ష హోదాలో తెలుసుకుని వస్తె తప్ప ఎవరికి తెలియకుండా గుట్టు చప్పుడు కాకుండా ప్రభుత్వ తీరును ఎండ కట్టిన భరత్. జిల్లా విద్యాశాఖాధికారితో మాట్లాడి ఈ పిల్లలకు ప్రభుత్వం తరపున వైద్య సహాయం అందించాలని లేకపోతే ఊరుకునేది లేదని హెచ్చరించారు. పైన ముఖ్య మంత్రి ఇటువంటి ఘటనలు జరిగితే అది అధికారుల బాధ్యత అంట, మరి ఈయన ఏమి చేస్తారంట అని ప్రశ్నించిన భరత్, మొన్న కల్తీ పాల ఘటన, వేట్ల పాలెం బాంబు పేలుడు ఘటన, రెండు రోజుల క్రితం ఈ విద్యార్థుల ఘటన అసలు కూటమి ప్రభుత్వ ఏమి చేస్తుంది బాధితుల కష్టాలు పట్టవా కనీసం పట్టించుకోరా! వెంటనే స్పందించి ఈ విద్యార్థులకు అండగా ప్రభుత్వం నిలబడాలని డిమాండ్ చేసిన భరత్. చెప్పిన వెంటనే పీత రామకృష్ణ మిత్ర బృందం వంగల మహాలక్ష్మి, దుర్గారావు, 29 వార్డు ఇంచార్జి మునీశ్వరరావు, రేగుళ్ళ శ్రీధర్ కి ప్రత్యేకంగా భరత్ ప్రశంసించారు.

# మాజీ సర్పంచ్ కుటుంబానికి పలువురు నేతలు పరామర్శలు



**మండపేట మండలం, విశ్వంవాయిస్ న్యూస్ :** ఆర్తమూరు మాజీ సర్పంచ్ పడాల భూలక్ష్మి ఇటీవల మృతి చెందటంతో వారి కుటుంబ సభ్యులను పలువురు బుధవారం పరామర్శించారు. భూలక్ష్మి భర్త, కోళ్ల రైతు సంక్షేమ సంఘం నాయకులు, పౌల్ట్రీ పరిశ్రమ నాయకులు పడాల సుబ్బారెడ్డి, ఆమె సోదరులు వైసిపి రాష్ట్ర కార్యదర్శి, రాజోలు నియోజకవర్గ వైసీపీ పరిశీలకులు కర్రీ పాపారాయుడు లను వైఎస్ఆర్సిపి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన కృష్ణార్జున చౌదరి, వైఎస్ఆర్సిపి పి.గన్నవరం కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాస్ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శులు కటకంశెట్టి ఆదిత్య, పాటిశివకుమార్, వైసిపి పార్టీ నాయకులు మాజీ ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు, కపిలేశ్వరపురం మండల వైసిపి అధ్యక్షులు గుంటూరు సత్యనారాయణ,సొసైటీ మండపేట మాజీ అధ్యక్షులు పెంకే గంగాధర్, శెట్టి నాగేశ్వరరావు, పలివెల మధు, ఐఎస్ఎన్ రాజు, గుబ్బల రమేష్, కురుపుడు రాంబాబు, నేతల నాని, ఉచ్చల విష్ణు .బుజ్జి రాజు, భూపతి రాజు సత్తిబాబు, రాజు జిల్లా వైసిపి ఉపాధ్యక్షులు కూనపరెడ్డి రాంబాబు , వైసిపి రాష్ట్ర సోషల్ మీడియా కార్యదర్శి నాని నేతల, మండల వైసిపి అధ్యక్షులు బ్రహ్మాజీ, కట్ట శ్రీను, భగవాన్, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి రవి రెడ్డి, బీసీ సెల్ వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుబ్బల మనోహ,ర్ మహమ్మద్ యూనస్ షరీఫ్, ఉచ్చుల విష్ణు, కిషోర్ యల్లమెల్లి, ఉచ్చుల మోహన్, మున్నా, మహేంద్ర భూపతి రాజు, వాసిరెడ్డి అర్జున్, ఎంపీటీసీలు పట్నాల నాగబాబు, తాతపూడి ఉషా రాజేష్, పలివెల సుధాకర్, వల్లూరి రామకృష్ణ, మేడిశెట్టి సూర్య భాస్కర్ రావు, మేర్నిపాడు సర్పంచ్ గారపాటి అశోక్, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు పిల్ల వీరబాబు, పడమట తరుణ్, విసుప్పు రెడ్డి శివ,మాజీ కౌన్సిలర్ బళ్ల రమణ, వి.కనకరాజు, సాధనల శివ భగవాన్, రామిశెట్టి శేఖర్ పాల్గొన్నారు.


మా 'విశ్వం వాయిస్' వాట్సాప్ ఛానల్‌లో జాయిన్ అవ్వండి!

నిజాయితీ గల వార్తలు.. నిరంతర అప్‌డేట్స్!

- బ్రేకింగ్ న్యూస్ అప్‌డేట్స్
- రోజువారీ తెలుగు దినపత్రిక PDF
- అంతర్జాతీయ, జాతీయ వార్తలు
- విశ్లేషణాత్మక కథనాలు

VISWAM VOICE BREAKING NEWS
WhatsApp channel

మీ ఫోన్ కెమెరాతో స్కాన్ చేసి గ్రూపులో చేరండి

JOIN NOW

లింక్ ద్వారా కూడా జాయిన్ అవ్వండి:
https://whatsapp.com/channel/0029Va7zLL1E50Uhr9gpAR1E

మాతో పాటు మరిన్ని వార్తలు మరియు తాజా అప్‌డేట్స్ తెలుసుకోండి.



# రెవెన్యూ సేవలు పారదర్శకంగా, వేగవంతంగా అందించాలి

**జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్**



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రెవెన్యూ సేవలను మరింత పారదర్శకంగా, వేగవంతంగా, ప్రజలకు సులభంగా అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి ఆశించిన పురోగతిని సాధించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్, భూ పరిపాలన ముఖ్య కమిషనర్ జి.జయలక్ష్మి జిల్లాల వారీగా రెవెన్యూ క్లినిక్‌లు, భూముల బదిలీ, పట్టాదారు పాస్ పుస్తకాలలో తప్పుల సవరణ, రీ-సర్వే 2.0, కుల విచారణ, డిజిటల్ రెవెన్యూ రిజిస్ట్రీ అంశాల పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ, పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా భూ సమస్యలకు తక్షణ పరిష్కారం కల్పించేందుకు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. గ్రామ, వార్డు స్థాయిలో నిర్వహిస్తున్న రెవెన్యూ క్లినిక్‌లలో భూ వివాదాలు, రికార్డు లోపాలు, హక్కుల బదిలీలు వంటి అంశాలను అధికారుల సమక్షంలోనే పరిష్కరించాలని తెలిపారు. మ్యూటేషన్లు, భూ హక్కుల బదిలీ నమోదు విషయంలో దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేసి నిర్దిష్ట గడువులోగా ఆమోదాలు పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్ కేసుల సంఖ్యను గణనీయంగా తగ్గించడమే లక్ష్యంగా సిబ్బంది అంకితభావంతో, జవాబుదారీతనంతో పని చేయాలన్నారు. పట్టాదారు పాస్ పుస్తకాలలో ఉన్న పేర్లు, సర్వే నంబర్లు, విస్తీర్ణం వంటి వివరాల్లోని పొరపాట్లను సరిచేయడానికి ప్రత్యేక డ్రైవ్ చేపట్టి రైతులకు ఖచ్చితమైన రికార్డులు అందించాలని సూచించారు. జీరో ఖాతాల సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేసి నిజమైన సాగుదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. రీ-సర్వే మూడో దశ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి గ్రౌండ్ వాల్యుయేషన్ నోటిఫికేషన్ జారీ, డ్రాఫ్ట్ ఆర్‌ఓఆర్ తయారీ, ఫైనల్ ఆర్‌ఓఆర్ జనరేషన్, ఈ-కేవైసీ ప్రక్రియలను పూర్తి చేసి రికార్డులు మరియు క్షేత్రస్థాయి వివరాలు సమానంగా ఉండేలా చూడాలన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో ఖచ్చితమైన మ్యాపింగ్ చేపట్టాలని, రీ-సర్వే ప్రక్రియను భూ యజమానుల సమక్షంలోనే నిర్వహించాలని సూచించారు. ప్రజల సహకారం ఈ కార్యక్రమానికి అత్యంత కీలకమని పేర్కొన్నారు. కుల విచారణ అంశాల్లో పారదర్శకత, న్యాయం పాటిస్తూ అర్హులైన వారికి సమయానికి ధృవపత్రాలు జారీ చేసి రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు విద్యా, ఉద్యోగ అవకాశాల్లో సక్రమంగా అమలు అయ్యేలా చూడాలని తెలిపారు. డిజిటల్ రెవెన్యూ రిజిస్ట్రీ అమలుతో భూ రికార్డులను పూర్తిగా డిజిటలైజ్ చేయడం ద్వారా ఎప్పుడైనా, ఎక్కడి నుండైనా రికార్డులను సులభంగా పరిశీలించే అవకాశం కలుగుతుందని, భవిష్యత్తులో భూ లావాదేవీలు మరింత పారదర్శకంగా జరిగేలా ఈ ప్రక్రియ దోహదపడుతుందని పేర్కొన్నారు. జిల్లాలో రెవెన్యూ పరిపాలనను ప్రజాకేంద్రీకృతంగా మార్చేందుకు రెవెన్యూ సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి, సర్వే ఏడీ కే. ప్రభాకర్, ఆర్డీవో జి.మమ్మీ, కలెక్టరేట్ సిబ్బంది సుబ్బరాజు, చినబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 8న మహిళలకు ప్రత్యేక జాబ్ మేళా



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, సత్యం వాసంశెట్టిఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రామచంద్రపురం మెయిన్ రోడ్‌లో ఆర్‌డిఓ ఆఫీస్ పక్కనగల లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయం ఎదురుగా ఉన్న టౌన్ హాల్ నందు ప్రత్యేకంగా జాబ్ మేళా నిర్వహించబడుతుందని మంత్రి సుభాష్ కార్యాలయం తెలిపింది. ఈ జాబ్ మేళాలో 18 నుంచి 28 సంవత్సరాలు కలిగిన స్త్రీ అభ్యర్థులకు టెన్త్, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లమా, డిగ్రీ ,బీటెక్, పీజీ చదివిన వారికి బెంగళూరు, చెన్నై ,హైదరాబాద్, తిరుపతిలో 1.8 నుంచి 2.4 ఎల్ పి ఏ వార్షిక వేతనంతో పనిచేసే విధంగా టాటా ఎలక్ట్రానిక్స్, ఫాక్స్ కాన్ , విస్టన్, రేమోండ్స్, మదర్ సన్, టిసిఎల్ , నియో లింక్ , ఫాక్స్ లింక్ కంపెనీలలో ఉద్యోగంలో కొరకు జాబ్ మేళా నిర్వహించబడుతుంది. అలాగే స్థానికంగా మహిళల ఉద్యోగాల కొసం లోకల్ జాబ్స్ తో జాబ్ మేళా కూడా నిర్వహించబడుతుంది. ఈ లోకల్ జాబ్ మేళాలో భాగంగా 1)25 సంవత్సరాల లోపు పదవ తరగతి చదివి జిడిఏ సర్టిఫికెట్ కలిగిన మహిళా అభ్యర్థులకు జీడి అసిస్టెంట్గా, 30 సంవత్సరాల లోపు జిఎన్ఎమ్, బిఎస్సి నర్సింగ్ చదివిన మహిళా అభ్యర్థులకు నర్స్ పోస్టులకు కిమ్స్ హాస్పిటల్ లోనూ,2)30 సంవత్సరాల లోపు 10వ తరగతి చదివిన మహిళా అభ్యర్థులకు మోర్ ,విజేత, విశాల్, డిమార్ట్ ,విక్టరీ బజార్ ఫ ,వసుధ, క్రోమ్, ట్రెండ్స్ వంటి షాపింగ్ మాల్స్ నందు వివిధ ఉద్యోగాల కొరకు, 3)35 సంవత్సరాల లోపు బీఫార్మసీ, డి ఫార్మసీ చదివిన మహిళా అభ్యర్థులకు అపోలో ఫార్మసీలో ఫార్మసిస్టులుగాను, 4)50 సంవత్సరాలు లోపు పదో తరగతి చదివిన మహిళా అభ్యర్థులకు హెచ్పిసిఎల్, ఐఓసీఎల్ ,బిపిసిఎల్, రిటైల్ పెట్రోల్ బంక్ అవుట్లెట్లో కస్టమర్ అటెండెంట్గా ఉద్యోగాల కొరకు ఇంటర్వ్యూలు నిర్వహించబడుతున్నవి. లోకల్ జాబ్స్ లో ఎంపికైన వారందరూ అమలాపురం, రాజమండ్రి ,కాకినాడ, మండపేట ,రామచంద్రపురం, మొత్తంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారు పదివేల నుంచి 15 వేల జీతంతో పనిచేయాల్సి ఉంటుంది. మిగతా వివరాలకు 9515481671 నెంబర్ లో సంప్రదించగలరు.

# తెదేపా సీనియర్ నేత వక్కలంక వీరభద్ర శర్మ (బుల్లియ) ఇక లేరు



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబాజీపేట మండలం పుల్లేటికురు గ్రామానికి చెందిన ఎన్టీఆర్ యువసేన అధ్యక్షులు తెదేపా సీనియర్ నేత వక్కలంక వీరభద్ర శర్మ (బుల్లియ) (66) బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో తుది శ్వాస విడిచారు. గుండె ఆగిపోవడంతో చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# శిక్షణా తరగతుల ద్వారా నాయకత్వ లక్షణాలు

**రామచంద్రపురం నుంచి మంగళగిరి శిక్షణా తరగతులకు తరలివెళ్లిన టీడీపీ పార్టీ శ్రేణులు**
**జెండా ఊపి వాహనాన్ని ప్రారంభించిన కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం**



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** పార్టీ శిక్షణా తరగతుల ద్వారా నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవచ్చునని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఈ నెల 5, 6 తేదీలలో నిర్వహించనున్న శిక్షణా తరగతులకు రామచంద్రపురం నియోజకవర్గం నుంచి పలువురు నాయకులు, క్లస్టర్ ఇన్చార్జిలు బయలుదేరి వెళ్లే వాహనాన్ని వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, పట్టణ అధ్యక్షులు ఉండవల్లి శివ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ, పార్టీ బలోపేతం, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం పెంపు, ప్రభుత్వ పథకాలపై స్పష్టమైన అవగాహన, ప్రజలతో మరింత సాన్నిహిత్యం పెంచడం లక్ష్యంగా ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆధునిక రాజకీయ పరిస్థితుల్లో సోషల్ మీడియా వినియోగం, బూత్ స్థాయి బలోపేతం, ఎన్నికల వ్యూహాలు, ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుదనం వంటి అంశాలపై ప్రత్యేక మార్గదర్శకాలు అందజేయబడతాయని పేర్కొన్నారు. ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలను ప్రతి గ్రామం, ప్రతి వార్డుకు చేర్చే బాధ్యత క్లస్టర్ ఇన్చార్జిలదేనని, శిక్షణ ద్వారా వారికి మరింత స్పష్టత, ధైర్యం, నాయకత్వ నైపుణ్యాలు పెంపొందుతాయని అన్నారు. రామచంద్రపురం నియోజకవర్గం నుంచి భారీ స్థాయిలో నాయకులు పాల్గొనడం పార్టీ పట్ల ఉన్న అంకితభావాన్ని సూచిస్తుందని పేర్కొన్నారు. శిక్షణా తరగతులకు హాజరవుతున్న వారిలో నాయకులు మేడిశెట్టి సూర్యనారాయణ, కంచుమర్తి బాబురావు, పెంకె సాంబశివరావు, చెల్లి గోపాలకృష్ణ, పలివెల ప్రకాష్, వనుం వీరబ్రహ్మం, పలివెల రాజు, సలాది సాయిబాబా, సలాది పట్టాభిరామయ్య, మరివాడ సూరిబాబు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో వాసంశెట్టి సత్యం, అక్కల రిశ్వంత్ రాయ్, ఉండవల్లి శివ, చందమామ వాసు, కవల నానాజీ, గేదల దొరబాబు తదితరులు పాల్గొన్నారు. పార్టీ మరింత బలోపేతం దిశగా ఈ శిక్షణా తరగతులు ఒక మైలురాయిగా నిలుస్తాయని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

### అల్లవరం మండలంలో

# 10వ తరగతి విద్యార్థులకు పరీక్షా కిట్ల పంపిణీ

**రాష్ట్ర స్థాయి ప్రతిభకు రూ.50 వేల వరకు నగదు ప్రోత్సాహకాలు**



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

అల్లవరం మండలంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షా కిట్ల పంపిణీ రాష్ట్ర స్థాయి ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహకాలు ప్రకటించిన ట్రస్టులు అల్లవరం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దేవగుప్తం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సామంతకుర్రు, గురుకుల పాఠశాల (బాలురు) గోడి, గురుకుల పాఠశాల (బాలికలు) గోడి పాఠశాలలలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులకు పరీక్షా కిట్లను ఘనంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని రుద్రరాజు సీతాపతిరాజు మెమోరియల్ ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్, మోసుగంటి గంగయ్య మెమోరియల్ ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడాలనే లక్ష్యంతో ఈ పరీక్షా కిట్లను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు రుద్రరాజు రమేష్ రాజు, మోసుగంటి వెంకటేశ్వరరావు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు యం.టి.వి. సుబ్బారావు, ముత్యాల ఆనంద నవీన్, కడలి శ్రీ సత్య సాయిబాబు, ఉమ, బత్తుల వెంకటలక్ష్మి, ముమ్మిడివరపు వెంకటేశ్వరరావు, కొప్పిశెట్టి శ్రీనివాస్, కొనుకు రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు. గురుకుల పాఠశాల సిబ్బంది కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ట్రస్టులు చేస్తున్న సేవలను కొనియాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థుల అభ్యున్నతికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ట్రస్ట్ అధ్యక్షులు మోసుగంటి వెంకటేశ్వరరావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఇష్టపడి కష్టపడి చదివి ఉన్నత స్థాయిలకు చేరుకోవాలి. పాఠశాలకు, గ్రామానికి, మండలానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి అని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో పోటీ భావన పెంపొందించేందుకు రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థికి రూ. 50,000, ద్వితీయ స్థానానికి రూ. 40,000, తృతీయ స్థానానికి రూ. 30,000 నగదు ప్రోత్సాహకాలను ప్రకటించారు. విద్యార్థులు ఈ సహాయాన్ని సద్వినియోగం చేసుకొని రాబోయే పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ట్రస్ట్ ప్రతినిధులు ఆకాంక్షించారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.

# కోనసీమ హెల్త్ వారియర్స్ స్పోర్ట్స్ మీట్-2026

**విజేతలకు జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా బహుమతుల ప్రదానం**




**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

క్రీడలు కేవలం పోటీలకే పరిమితం కావని, అవి ఆరోగ్యకరమైన జీవనశైలికి, సమన్వయానికి, నాయకత్వ లక్షణాలకు ప్రతీకలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి. నిశాంతి పేర్కొన్నారు. జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి డాక్టర్ కే. కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కోనసీమ హెల్త్ వారియర్స్ స్పోర్ట్స్ మీట్-2026లో విజేతలకు బుధవారం అమలాపురం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. గత నెల 15, 16 తేదీలలో అంబాజీపేట కేంద్రంగా కోనసీమ జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల సిబ్బందితో క్రికెట్ పోటీలు నిర్వహించగా, 21, 22 తేదీలలో స్థానిక జిఎంసి బాలయోగి స్టేడియంలో బ్యాడ్మింటన్ (షటిల్) పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులను ఈ సందర్భంగా సత్కరించారు. అమలాపురం నుంచి డాక్టర్ కారెం రవితేజ, వారి జట్టు క్రికెట్, షటిల్ విభాగాల్లో ప్రథమ స్థానం సాధించారు. టీ. కొత్తపల్లి నుంచి డాక్టర్ విజయ్ మనోజ్, వారి జట్టు షటిల్‌లో ప్రతిభ చాటి, ఆయన కెప్టెన్సీలో క్రికెట్‌లో రన్నర్స్‌గా నిలిచి బహుమతులు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, కోనసీమ హెల్త్ వారియర్స్ స్పోర్ట్స్ మీట్‌లో విజేతలకు బహుమతులు అందజేయడం తనకు ఎంతో ఆనందం, గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. ఆరోగ్య రంగంలో నిత్యం సేవలందిస్తున్న హెల్త్ వారియర్స్ క్రీడారంగంలోనూ ప్రతిభ చాటడం అభినందనీయమన్నారు. వారు సమాజ ఆరోగ్యం కోసం ప్రతి రోజూ కృషి చేస్తూ, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణ దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం పెంపొందుతాయని, సమైక్యతా భావం బలపడుతుందని పేర్కొన్నారు. ఈ స్పోర్ట్స్ మీట్‌ను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. పాల్గొన్న ప్రతి ఒక్కరూ విజేతలేనని, బహుమతులు పొందిన వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వారి కృషి, క్రమశిక్షణ, పట్టుదల అందరికీ ఆదర్శంగా నిలవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. మున్ముందు కూడా ఇలాంటి క్రీడా కార్యక్రమాలను మరింత ఉత్సాహంగా నిర్వహిస్తూ, ఆరోగ్యవంతమైన కోనసీమ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. ఆరోగ్యం, క్రీడలు, కోనసీమ సంస్కృతిని కలగలిపి ఈ హెల్త్ వారియర్ ఈవెంట్‌ను నిర్వహించిన అధికారులు, స్పోర్ట్స్ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజ సంస్థలను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ఈ క్రీడా మీట్ ద్వారా కోనసీమలోని ప్రతి గ్రామం, ప్రతి మండలం, ప్రతి కుటుంబం ఆరోగ్యకరమైన జీవనశైలికి, క్రీడాస్ఫూర్తికి, సమైక్యతకు ప్రాధాన్యత ఇస్తోందన్న విషయం సంతృప్తికరమన్నారు. హెల్త్ వారియర్లు అందరూ ఈ కార్యక్రమంలో ప్రత్యేక స్థానం పొందడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమం కేవలం ప్రతిభ ప్రదర్శన మాత్రమే కాదని, ఆరోగ్యం, క్రీడలు, సమాజప్రేమ, సేవాభావం వంటి విలువలను ఇంటింటికి తీసుకెళ్లే ప్రయత్నమని పేర్కొన్నారు. బహుమతులు పొందిన ప్రతి క్రీడాకారుడు, ప్రతి హెల్త్ వారియర్, ప్రతి స్వయంసేవకుడు కోనసీమ యువతకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి డాక్టర్ కే. కార్తీక్ రెడ్డి, డాక్టర్ దయానా తదితర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలకు చేరువగా పల్లె నిద్ర

**కోనసీమ జిల్లాలో పోలీసుల వినూత్న కార్యక్రమం**




**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా 'పల్లెనిద్ర' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రజలకు పోలీస్ యంత్రాంగాన్ని మరింత చేరువ చేయడం, క్షేత్రస్థాయిలో సమస్యలను నేరుగా తెలుసుకోవడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో అధికారులు గ్రామాల్లో రాత్రి గడుపుతూ ప్రజలతో సమావేశమై భద్రతపై భరోసా కల్పించారు. రచ్చబండల వద్ద ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా పోలీసులు ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటారని తెలిపారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ తెలియని లింకులను క్లిక్ చేయకూడదని, ఓటీపీ వివరాలను ఎవరికీ చెప్పవద్దని సూచించారు. మహిళలు, చిన్నారులపై నేరాలకు కఠిన చర్యలు తీసుకుంటామని, ఎలాంటి వేధింపులైనా ఎదురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని పేర్కొన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. రోడ్డు భద్రతపై దృష్టి సారిస్తూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. రావులపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో కొమరాజులంక గ్రామంలో, అంబాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో గంగలకుర్రు గ్రామంలో, రామచంద్రపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోడవరం గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ప్రజల ముంగిటకే పాలనను తీసుకువెళ్లడం, నేర రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ఇటువంటి కార్యక్రమాలు కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.

# జగన్, భూమన, వైవీ సుబ్బారెడ్డి ఆర్గనైజ్డ్ క్రైమ్ చేశారు : పంచుమర్తి అనురాధ

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుమల శ్రీవారిపై గతంలో జగన్ ప్రభుత్వం కక్షగట్టిందని తెదేపా ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నారు. తిరుమల లడ్డూ కల్తీ అంశంపై శాసన మండలిలో జరిగిన చర్చలో ఆమె మాట్లాడారు. టెండర్ నిబంధనలను సవరించి ఇష్టానుసారం వ్యవహరించారని విమర్శించారు. "అనేక భయంకరమైన రసాయనాలు కలిసి ఉన్నవాటికి ఆవు నెయ్యి అని పేరు పెట్టారు. రోజుకు 4లక్షల లీటర్ల పాలు కొనుగోలు చేయాలన్న నిబంధనను సడలించారు. నెయ్యి ఉత్పత్తిలో అనుభవాన్ని మూడేళ్ల నుంచి ఏడాదికి కుదించేశారు. టర్నోవర్ ఏడాదికి రూ.250 కోట్లు అని ఉన్న నిబంధనను రూ.150 కోట్లకు పరిమితం చేశారు. సాంకేతిక అధ్యయనం, క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా టెండర్లు కట్టబెట్టారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలను నీరుగార్చేశారు. టెండర్ నిబంధనల సడలింపుపై తితిదే అప్పటి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సంతకం చేశారు. నెయ్యి కల్తీ జరిగిందని ఎన్డీడీబీ నివేదిక ఇచ్చింది. ఇది కుంభకోణమే కాదు.. హిందుత్వంపై దాడి. మాజీ సీఎం జగన్, తితిదే మాజీ ఛైర్మన్లు భూమన కరుణాకర్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి ఆర్గనైజ్డ్ క్రైమ్ చేశారు" అని పంచుమర్తి అనురాధ అన్నారు.



# పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు సస్పెన్షన్...!

## విధుల్లో అలక్ష్యం, నిర్లక్ష్యమే సస్పెన్షన్‌కు కారణం




**పెద్దాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరి రాజును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసింది. సామర్లకోట మండలం వేట్లపాలెం లోని సూర్యశ్రీ ఫైర్ వర్క్స్ పరిశ్రమలో జరిగిన భారీ అగ్ని ప్రమాద ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ ప్రమాదంలో భారీగా ప్రాణ నష్టం సంభవించడంతో ప్రభుత్వం అప్రదిష్ట పాలైంది. ఈ నేపథ్యంలో ఈ భారీ అగ్నిప్రమాద ఘటనకు డీఎస్పీ శ్రీహరి రాజును పరోక్ష కారకుడుగా ప్రభుత్వం భావించింది. విధుల్లో బాధ్యతా రాహిత్యం, అనుమతులు లేని బాణాసంచా తయారీ పరిశ్రమలపై పర్యవేక్షణ లేకపోవడం, లోపాల నియంత్రణ, భద్రత, జాగ్రత్త చర్యలపై ముందస్తుగా బాణాసంచా తయారీదారులను హెచ్చరించక పోవడం, నిబంధనలను ఉల్లంఘించడం, సరైన తనిఖీలు చేపట్టక పోవడం, అనుమతులు లేకపోయినా బాణాసంచా తయారీకి, నిల్వకు అవకాశం కల్పించడం వంటి డిఎస్పీ వైఫల్యాలే ఈ భారీ అగ్నిప్రమాదం జరగడానికి, ఫలితంగా 26 మంది దుర్మరణం పాలవ్వడానికి కారణంగా భావిస్తూ క్రమశిక్షణ, చట్టబద్ధ చర్యల కింద ఆయనపై ఈ సస్పెన్షన్ చర్యలను ప్రభుత్వం తీసుకున్నట్లు తెలుస్తోంది. అంతే కాకుండా డీఎస్పీ శ్రీహరి రాజుతో పాటు, పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి, జిల్లా కార్మికశాఖ అధికారి, జిల్లా అగ్నిమాపక అధికారిని కూడా సస్పెండ్ చేసినట్లు సిఎం చంద్రబాబు వెల్లడించారు. పెద్దాపురం ఇంచార్జ్ డీఎస్పీగా జిల్లా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ కేవివి. సత్యనారాయణను ప్రభుత్వం నియమించింది. బాణాసంచా తయారీ, భారీ అగ్నిప్రమాదం, ఒక్కసారిగా పెద్ద సంఖ్యలో కార్మికులు చనిపోయిన నేపథ్యంలో కొందరు అధికారులు లంచాలు తీసుకుని నిబంధనలను పక్కన పెట్టారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. రాజమహేంద్రవరం ఏసీబీ డీఎస్పీగా పనిచేస్తూ బదిలీపై వచ్చి ఆదివారం 22 సెప్టెంబర్ 2024 న పెద్దాపురం డీఎస్పీగా బాధ్యతలను స్వీకరించిన అనంతరం డి.శ్రీహరిరాజు మీడియాతో మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని శాంతి భద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానన్నారు. అక్రమాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అయితే ఆయన హామీని ఎంత వరకు సఫలం చేశారో ఆయన ఆత్మ సాక్షికే తెలియాలి. ఐతే పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసినట్టు ఒక ప్రశ్నకు బదులుగా ప్రత్తిపాడు సిఐ. బి.సూర్యఅప్పారావు బుధవారం సాయంత్రం 6.11 గంటలకు చరవాణీలో "విశ్వం వాయిస్"కు వివిరణ ఇచ్చారు.

# అయితపూడిలో పోలీసుల పల్లె నిద్ర

## నేరాలపై అప్రమత్తత, చట్టలపై అవగాహన



**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఆదేశాల మేరకు కాకినాడ ఎస్డీపీవో మనీష్ దేవరాజ్ పాటిల్ సూచనతో గొల్లపాలెం ఎస్ఐ ఎమ్ మోహన్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి అయితపూడి గ్రామంలో పోలీసుల పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గొల్లపాలెం ఎస్సై మోహన్ కుమార్ పోలీస్ సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించారు. ఈ మేరకు స్థానిక ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతలు, గ్రామంలో పరిస్థితులు, అసాంఘిక కార్యకలాపాలు, జులాయిల కదలికల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా నూతన చట్టాలు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, రోడ్డు భద్రతా నియమాలు, సామాజిక మాధ్యమాల వినియోగం మరియు డ్రగ్స్ నిర్మూలన వంటి కీలక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కొత్త వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలని కోరారు. గ్రామాల్లో ఎక్కడెక్కడ జజుం కెమెరాలు అవసరమో ప్రజలు తమ వంతు సహకారంగా ముందుకి వచ్చి, అన్ని గుళ్ళు, విగ్రహాల వద్ద లైట్లు, కెమెరాలు బిగించుటకు సహకరించాలని కోరారు. వీటి వల్ల నేరం జరగకుండా అడ్డుకోవచ్చని చెప్పారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, గంజాయి వంటి మత్తు పదార్థాలు వాడినా, సామాజిక మాధ్యమాలలో ఇతరులను రెచ్చగొట్టే విధంగా పోస్ట్ లు పెట్టినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం గ్రామంలో పోలీసు సిబ్బందితో నిద్ర చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చెర్మన్ కొల్లు వెంకటేశ్వరరావు, పెదిరెడ్డి శ్రీనివాస్, సౌదాల రాజు, పెదిరెడ్డి వీరభద్రరావు, సౌదాల అప్పన్న, పి.వెంకన్న, దాసరి సతీష్, రాయుడు సత్యనారాయణ, స్థానిక నాయకులు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఏపీని ఫిలిం, టెలివిజన్ హబ్‌గా మారుస్తాం

## టీవీ కళాకారులకు తగిన గుర్తింపు, గౌరవం కల్పిస్తామని హామీ : మంత్రి కందుల దుర్గేష్
## పెండింగ్‌లో ఉన్న టీవీ అవార్డుల ప్రదానానికి చర్యలు తీసుకుంటామని వెల్లడి
## మంత్రి కందుల దుర్గేష్‌ని కలిసిన టెలివిజన్ ఫ్రెటర్నిటీ ఫోరమ్ ప్రతినిధులు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సినీ, టెలివిజన్ రంగానికి ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వర్యులు కందుల దుర్గేష్ పేర్కొన్నారు. బుధవారం వెలగపూడి సచివాలయంలోని తన ఛాంబర్ లో టెలివిజన్ ఫ్రెటర్నిటీ ఫోరమ్ సభ్యులు ఎఫ్ డీసీ ఎండీ విశ్వనాథన్ తో కలిసి మంత్రి దుర్గేష్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బుల్లితెర కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలు మరియు పరిశ్రమ అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను విన్నవించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ గత 45 ఏళ్లుగా టీవీ పరిశ్రమ రాష్ట్ర ఆర్థిక ప్రగతికి, కళాకారుల ఉపాధికి అందిస్తున్న సహకారం అభినందనీయమని కొనియాడారు. చలనచిత్ర పరిశ్రమతో సమానంగా టీవీ రంగానికి కూడా గుర్తింపునిచ్చేలా విధివిధానాలు రూపొందిస్తామని హామీ ఇచ్చారు. విశాఖపట్నం జిల్లా భీమిలి వద్ద కేటాయించిన స్థలంలో 'టీవీ నగర్' (నివాస స్థలాలు) మరియు స్టూడియోల నిర్మాణం కోసం సభ్యులు చేసిన అభ్యర్థనను సానుకూలంగా పరిశీలిస్తామన్నారు. అమరావతి, వైజాగ్, రాజమండ్రి, తిరుపతి ప్రాంతాలలో స్టూడియోల ఏర్పాటుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న టీవీ నంది అవార్డులను త్వరలోనే అందజేస్తామని, ఉగాది పురస్కారాలలో టీవీ కళాకారులకు తగిన ప్రాధాన్యత కల్పిస్తామని స్పష్టం చేశారు. దివంగత ప్రముఖులు సుమన్ గారు, దేవదాస్ కనకాల గారి పేర్లతో కళాకారులను సత్కరించే ప్రతిపాదనను పరిశీలిస్తామన్నారు. షూటింగ్స్ కోసం ప్రభుత్వ స్థలాలు, ఆడిటోరియాలు, దేవాలయాల వద్ద రాయితీలు కల్పించడంపై హర్షం వ్యక్తం చేసిన సభ్యులకు, భవిష్యత్తులో టూరిజం గెస్ట్ హౌస్‌లలో కూడా రాయితీలు కల్పించే దిశగా నిర్ణయం తీసుకుంటామని మంత్రి దుర్గేష్ తెలిపారు. ప్రభుత్వానికి మరియు టీవీ పరిశ్రమకు మధ్య వారధిగా పనిచేసేందుకు 'టెలివిజన్ ఫ్రెటర్నిటీ ఫోరమ్'ను అనుసంధాన కమిటీగా గుర్తించాలన్న కోరికను పరిగణనలోకి తీసుకుంటామని మంత్రి దుర్గేష్ వారికి చెప్పారు. ఈ అంశాలన్నింటినీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన సాకారం చేస్తామని మంత్రి కందుల దుర్గేష్ భరోసా ఇచ్చారు. మంత్రి కందుల దుర్గేష్ స్పందనపై టీవీ ఆర్టిస్టులు ఆనందం వ్యక్తం చేశారు. మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసిన వారిలో నిర్మాతలు, దర్శకులు సుధాకర్, పాలడుగు విశ్వనాథ్, దిలీప్ రాజా, రామ్ దాస్ నాయుడు, వి.వి నిరంజన్, నటులు బాలాజీ, విజయ్ యాదవ్, మేకా రామకృష్ణ, నటీమణులు రాగిణి, రోజా భారతి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి ఔట్.. శ్రీధర్ ఇన్..!



**పెద్దాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా పెద్దాపురం రెవెన్యూ డివిజనల్ అధికారిణి (ఆర్డీవో) కట్రెడ్డి శ్రీరమణి ఔట్ అయ్యారు. జి.ఒ.ఆర్.టి. సంఖ్య 338, రెవెన్యూ (విజిలెన్స్-1) విభాగం ప్రకారం ఈమెను విధుల నుంచి తొలగిస్తూ 2 తేదీ మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. భద్రతా చర్యలను పాటించడంలో పెద్దాపురం ఆర్డీవో కె.శ్రీరమణి విఫలమైనట్లు గుర్తించి సస్పెన్షన్ వేటు వేసింది. దీంతో ఈమె ఔట్ (మాజీ అధికారిణి) అయ్యారు. రెవిన్యూ పరిపాలనా సౌలభ్యం కోసం ఆమె స్థానంలో పూర్తి అదనపు బాధ్యతల అధికారిగా ఎన్.శ్రీధర్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలోని జరిగిన బాణాసంచా తయారీ కేంద్రంలో పేలుడు, దాని ఫలితంగా 26 మంది మరణ ఘటనకు సంబంధించి విధి నిర్వహణలో అలసత్వం వహించినందుకు ఆమెపై ఈ చర్య తీసుకున్నారు. పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి తోపాటు రాజమహేంద్రవరం అసిస్టెంట్ కార్మిక కమిషనర్, కాకినాడ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ గా వ్యవహరిస్తున్న బీఎస్.ఎం.వల్లీపై కూడా సస్పెన్షన్ వేటు వేసింది. వేట్లపాలెం సూర్యశ్రీ ఫైర్ వర్క్స్ లో రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు, రికార్డుల్లో కార్మికుల పేర్లను నమోదు చేయడంలో విఫలం అయ్యినందుకు, పర్యవేక్షణలో తీవ్ర నిర్లక్ష్యం వహించి నందుకు, పనిచేసే కార్మికులకు బీమా పథకం కింద కవర్ చేయడంలో నిర్లక్ష్యం వహించారనే నివేదికల మేరకు బీఎస్.ఎం.వల్లీని తక్షణం సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# పెద్దాపురం ఆర్డీవోగా ఎన్.శ్రీధర్ నియామకం



**పెద్దాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా పెద్దాపురం రెవిన్యూ డివిజనల్ అధికారిగా ఎన్.శ్రీధర్ నియమితులు అయ్యారు. ఎన్.శ్రీధర్‌ను పూర్తి అదనపు బాధ్యతల అధికారిగా నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరఫున జిల్లా కలెక్టర్ సన్ మోహన్ సగిలి మంగళవారం ఉత్తర్వులను జారీ చేశారు. ఇప్పటి వరకు ఆర్డీవోగా పని చేసిన కట్రెడ్డి శ్రీరమణిని రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసిన విషయం విధితమే. ఆమె స్థానంలో నియమితులైన శ్రీధర్ పెద్దాపురం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఆర్డిఓగా బాధ్యతలను స్వీకరించారు. సామర్లకోట మండలం వేట్లపాలెం బాణాసంచా పరిశ్రమ ప్రమాదంలో 26 మంది మృతి చెందారు. అధికారుల తనిఖీల వైఫల్య ఫలితంగా ప్రమాదం సంభవించినట్లు ప్రాథమికంగా లభించిన నివేదిక ప్రకారం ఆర్డిఓ శ్రీరమణిని సస్పెండ్ చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. భాధ్యతలను స్వీకరించిన శ్రీధర్ ను పెద్దాపురం తాహసిల్దార్ సి. హెచ్.వెంకటలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

# బాధిత కుటుంబాలకు అండగా కూటమి ప్రభుత్వం

## కొందరి నిర్లక్ష్యం, దురాశ కారణంగానే బాణసంచా పేలుడు ఘటన - సూర్యశ్రీ ఫైర్ వర్క్స్ పరిశ్రమకు వైసీపీ హయాంలోనే అనుమతి
## వేట్లపాలెం బాణసంచా పేలుడు ఘటనపై శాసనసభలో ప్రకటన చేసిన సీఎం చంద్రబాబు
## మృతులకు సంతాపం తెలుపుతూ రెండు నిముషాలు మౌనం పాటించిన శాసనసభ

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా వేట్లపాలెం బాణసంచా పేలుడు ఘటనలో మృతుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ ఘటనలో ఇప్పటి వరకూ 26 మంది మృతి చెందటం అత్యంత బాధాకరమని సీఎం అన్నారు. శాసనసభలో ఈ ఘటనపై ముఖ్యమంత్రి ప్రకటన చేశారు. ప్రస్తుతం ఆరుగురు వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. సూర్యశ్రీ ఫైర్ వర్క్స్ పరిశ్రమకు వైసీపీ హయాంలోనే అనుమతి ఇచ్చారని ముఖ్యమంత్రి తెలియచేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఈ పరిశ్రమ బాణసంచా ఉత్పత్తి చేస్తోందని సీఎం తెలిపారు. మొత్తం 30 మంది ఆ కర్మాగారంలో పనిచేస్తున్నారని.. పరిమితికి మించి మందుగుండు సామాగ్రి నిల్వ చేశారన్నారు. ఆర్డర్లు ఉన్నాయన్న కారణంతో బాణా సంచా పెద్ద ఎత్తున తయారు చేస్తున్నారని తెలిపారు. ఘటన సమయంలో విజయనగరం పర్యటనలో ఉన్నానని.. విషయం తెలిసిన వెంటనే ఘటనా స్థలికి వెళ్లానని ముఖ్యమంత్రి వివరించారు. ప్రమాదం జరిగిన 30 నిముషాల్లోనే పోలీసులు, అగ్నిమాపక శాఖ ఘటనా స్థలికి వెళ్లారని స్పష్టం చేశారు. ఈ ఘటనలో ఆ సంస్థ యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఘటనలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చానని.. మృతుల కుటుంబాలకు కేంద్రం రూ.2 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ. 20 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించామని స్పష్టం చేశారు. ఇళ్లు లేని వారందరికీ ఇళ్లు కట్టించి ఇస్తామని.. ప్రభుత్వ పరంగా బాధితులందరినీ ఆదుకుంటామని సీఎం తెలియచేశారు. తీవ్ర నిర్లక్ష్యానికి ఉదాహరణగా నిలుస్తున్న ఈ ఘటనకు సంబంధించి కొందరు అధికారులను గుర్తించి సస్పెండ్ చేశామన్నారు. పెద్దాపురం ఆర్డీఓ, పెద్దాపురం డీఎస్పీ, జిల్లా ఫైర్ ఆఫీసర్, లేబర్ ఆఫీసర్లను సస్పెండ్ చేసినట్టు ముఖ్యమంత్రి తెలిపారు.

### ప్రతిపక్ష పార్టీకి ప్రజాసమస్యలు పట్టటం లేదు

ఈ ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు చేసేందుకు పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్, ఐజీ రామకృష్ణలతో అధికారుల కమిటీని నియమించామన్నారు. సూర్యశ్రీ ఫైర్ వర్క్స్ పేరిట ఈ లైసెన్సు తీసుకున్నారని.. అన్ని జాగ్రత్తలూ తీసుకుని ఉత్పత్తి చేయాల్సి ఉందని అయితే దురాశతో ఎక్కువ బాణా సంచా తయారు చేయాలని ప్రయత్నించి ప్రమాదానికి కారణమయ్యారన్నారు. భవిష్యత్తులో ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా అన్ని చర్యలూ తీసుకుంటామని అన్నారు. నిందితుల ఆస్తుల్ని కూడా ఆక్షన్ వేసి బాధిత కుటుంబాలకు ఇస్తామని వివరించారు. ఈ తరహా నిర్లక్ష్య పూరిత అంశాలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని తెలిపారు. ఆడబిడ్డలపై అకృత్యాలకు పాల్పడుతున్న ఘటనల పైనా తీవ్ర చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. రాష్ట్రంలో ప్రతిపక్షంగా ఓ పార్టీ ఉన్నా ఇలాంటి సమస్యలు పట్టటం లేదని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఈ తరహా ప్రజాసమస్యలపై కాకుండా తిరుపతి శ్రీవారి లడ్డూ ప్రసాదం గురించి రాజకీయం చేస్తున్నారని అన్నారు. బాధ్యత కలిగిన ప్రభుత్వంగా ప్రజా రక్షణ బాధ్యత నుంచి తాము తప్పించుకోబోమని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. ఈ తరహా వ్యవహారాల్లో కఠినమైన నిబంధనలు తీసుకువచ్చి చర్యలు తీసుకుంటామని శాసనసభా వేదికగా ముఖ్యమంత్రి ప్రకటించారు. బాణా సంచా పేలుడు ఘటనలో ఇంతమంది మరణించటం తీవ్ర ఆవేదన కలిగిస్తోందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. బాణా సంచా తయారీ పరిశ్రమల్లో చిన్న తప్పిదం కూడా పెను ప్రమాదానికి కారణం అవుతుందని అన్నారు. ఈ ఘటనలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నట్టు సీఎం ప్రకటించారు. అనంతరం ప్రమాదంలో మృతి చెందిన వారికి సంతాపంగా రెండు నిముషాల పాటు మౌనం పాటించింది.

### ఒడిశాలో వీల్‌చైర్ క్రికెట్‌లో

# ఆంధ్రకు ద్వితీయ స్థానం

## జిల్లా క్రీడాకారుల ప్రతిభకు కలెక్టర్ అభినందనలు




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** దివ్యాంగ క్రికెట్ కంట్రోల్ బోర్డ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో, సమీర్ దివ్య సాహిత్య ట్రస్ట్ నిర్వహణలో ఒడిశా రాష్ట్రంలో ఫిబ్రవరి 21 నుండి 23 వరకు జరిగిన వీల్‌చైర్ క్రికెట్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టు ద్వితీయ స్థానం సాధించింది. ఈ జట్టులో మొత్తం 8 మంది క్రీడాకారులు తూర్పుగోదావరి జిల్లాకు చెందినవారు కావడం విశేషం.ఈ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కలెక్టర్ కీర్తి చేకూరి క్రీడాకారులను అభినందించారు. దివ్యాంగ క్రీడాకారులు ప్రతిభతో రాష్ట్రానికి కీర్తి తీసుకువచ్చారని ప్రశంసించారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా పరిపాలన తరఫున అవసరమైన ప్రోత్సాహం, సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ) శేషగిరి, యోగా కోచ్ నాగేంద్ర, ఫుట్‌బాల్ కోచ్ నాగరాజు, చెస్ కోచ్ జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.



# హుక్కుంపేటలో వివాహిత మృతి

## విజయలక్ష్మీ మృతి అనుమానం..హత్య.. ఆత్మహత్య...? – ఇద్దరు పిల్లల భవిష్యత్ ప్రశ్నార్ధకం



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం రూరల్ పరిధిలో హుక్కుంపేట గ్రామంలో వివాహిత మృతి వెనుక అసలు కారణాలేంటి..? రాజమండ్రి రూరల్ మండలంలో కలకలం రేపిన ఘటన రాజహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరు పరిధిలోని హుగ్గంపేటలో గోల్డెన్ ఫంక్షన్ హాల్ ఎదురుగా జీవీకే సిగ్నేచర్ అపార్ట్మెంట్ 202 నందు చోటు చేసుకున్న తమ్మా విజయలక్ష్మి మృతి కేసు సాధారణ కుటుంబ కలహాలకే పరిమితమా? లేక దీని వెనుక మరింత లోతైన కారణాలున్నాయా? ఈ ఘటనపై స్థానికుల, కుటుంబ సభ్యుల వాంగ్మూలాల ఆధారంగా కొన్ని కీలక అంశాలు వెలుగులోకి వస్తున్నాయి.

**24 ఏళ్ల వీరి దాంపత్యం.. కానీ బాధలే ఎక్కువ?**

2002లో తమ్మా రవితో విజయలక్ష్మి వివాహం జరిగింది.ఇద్దరు సంతానం ఉన్న ఈ కుటుంబంలో ప్రారంభం నుంచి ఆర్థిక స్థిరత్వం లోపించిందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. రవి చెప్పిన ఉద్యోగ హామీలు నిజం కాలేదని, వ్యాపారాల పేరుతో అప్పులు చేసి, బాధ్యతలు నిర్వర్తించలేదని ఆరోపిస్తున్నారు. పిల్లల చదువుల ఖర్చులు కూడా ఎక్కువగా బాధితురాలి పుట్టింటివారే భరించాల్సి వచ్చిందని సమాచారం.

**అనుమానం – మానసిక హింస ఆరోపణలు**

స్థానిక నివాసితుల వాంగ్మూలాల ప్రకారం, రవి తన భార్యపై అనుమానం పెంచుకుని తరచూ వాగ్వాదాలు సృష్టించేవాడని చెబుతున్నారు. చిన్న విషయానికే తీవ్ర పదజాలంతో దూషించడం, ఇతరుల ముందు అవమానించడం జరుగుతుండేదని అపార్ట్మెంట్ నివాసితులు తెలిపారు. ఈ మానసిక ఒత్తిడి బాధితురాలిని తీవ్రంగా కుంగదీసిందని కుటుంబ సభ్యులు అంటున్నారు.



**చారిటబుల్ ట్రస్ట్ – ఇమేజ్ పాలిటిక్సా?**

సమాజంలో మంచి పేరు కోసం రవి ఒక చారిటబుల్ ట్రస్ట్ ప్రారంభించినప్పటికీ, వ్యక్తిగత జీవితం మాత్రం భిన్నంగా ఉందని కొందరు ఆరోపిస్తున్నారు. ట్రస్ట్ సభ్యులతో కూడా విభేదాలు తలెత్తినట్లు సమాచారం. బయట ఒక రూపం, ఇంట్లో మరో రూపం అన్న చర్చ స్థానికంగా వినిపిస్తోంది.

**అనైతిక సంబంధాల ఆరోపణలు**

వేల్పూరు ప్రాంతంలో వ్యాపారం పేరుతో రవికి ఇతర మహిళలతో సంబంధాలున్నాయనే అనుమానాలు కుటుంబంలో విభేదాలకు దారితీసినట్లు తెలుస్తోంది. ఈ విషయం పై ఇటీవల ఘర్షణలు పెరిగినట్లు సమాచారం. అయితే ఈ ఆరోపణలపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ వెలువడలేదు.

**చివరి కాల్... ఆవేదన సంకేతమా?**

ఘటన రోజు సాయంత్రం విజయలక్ష్మి హైదరాబాద్లో ఉన్న తన అన్నకు ఫోన్ చేసి పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఇది ఆమె మానసిక స్థితి ఎంత దెబ్బతిన్నదో సూచిస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కీలక ప్రశ్నలు**

దీర్ఘకాలిక మానసిక వేధింపులపై ముందే ఫిర్యాదు ఎందుకు చేయలేదు?
కుటుంబ సభ్యులు, పొరుగువారు మధ్యవర్తిత్వం చేయలేకపోయారా?
ఆస్తి, ఆర్థిక వ్యవహారాలు ఈ ఘటనకు ఎంతవరకు కారణం?
ఇద్దరు చిన్నారుల భవిష్యత్ భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

**పోలీసుల దర్యాప్తు దిశ**

మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఫోన్ కాల్ వివరాలు, కుటుంబ సభ్యుల వాంగ్మూలాలు, ఆర్థిక లావాదేవీలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. పూర్తి నిజాలు అధికారిక దర్యాప్తు అనంతరం వెలుగులోకి రానున్నాయి. ఈ ఘటన మరోసారి కుటుంబాలలో పెరుగుతున్న మానసిక హింస, అనుమానాల తీవ్రతపై ఆలోచింపజేస్తోంది. ఇద్దరు పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిన ఈ విషాద ఘటనకు న్యాయం ఎప్పుడు దక్కుతుందన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్న గా ఉంది.

# కోరుకొండ నరసన్న కళ్యాణోత్సవ ఆదాయం 21.20 లక్షలు



**కొవ్వూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ స్వయంభు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణోత్సవలలో 21.20 లక్షల ఆదాయం సమకూరిందని అన్నవరం దేవస్థానం ఏఈఓ అనకాపల్లి ప్రసాద్ తెలిపారు. బుధవారం కొండపైన, దిగువున ఉన్న హుండీలను అన్నవరం దేవస్థానం అధికారులు ఆధ్వర్యంలో లెక్కించడం జరిగిందన్నారు. దర్శనం టికెట్లు1,66,030 రూపాయలు, లడ్డు విక్రయాలు 3,17,200 రూపాయలు, హుండీలు 11,61,702 రూపాయలు, కొబ్బరి చెక్కలు లక్ష 95వేల రూపాయలు, జోళ్ళు స్టాండ్ 73 వేల రూపాయలు, కేశఖండన 6,500 రూపాయలు, దుకాణాల పాటలు 11,500 రూపాయలు, కళ్యాణ్ టిక్కెట్లు1,89,720 రూపాయలు నరసన్నకు ఆదాయం సమకూరిందన్నారు. గత ఏడాది కంటే లక్ష 17 వేల రూపాయలు తగ్గిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎస్వీ రంగరాజ బట్టర్, అన్నవరం దేవస్థానం సిబ్బంది, కోరుకొండ దేవస్థానం సిబ్బంది శ్రీనివాస్, మురళి తదితరులు పాల్గొన్నారు.

### దేవోక్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

# పేదలకు భోజన సమర్పణ



**కొవ్వూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** దేవోక్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కీ.శే కొయ్య అప్పారావు, మరియమ్మ వీరి ఇరువురి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు కొవ్వూరు గోష్పాద క్షేత్రం దగ్గర వున్న పేదవారికి భోజనాలు సమర్పణ చేశారు.ఈ కార్యక్రమంలో దేవోక్తి చారిటబుల్ ట్రస్ట్ టీమ్ సభ్యులు బాబు, ప్రవీణ్, ప్రత్తిపాటి నాగరాజు, ప్రకాష్,లు పాల్గొన్నారు.

### ఆంధ్రప్రదేశ్ పేరులో ప్రదేశ్‌ను తొలగించి

# 'ఆంధ్ర రాష్ట్రం'గా మార్చాల్సిందే..

## ఆంధ్రప్రదేశ్ పేరు మార్పుపై గరికపాటి నరసింహారావు మాటలు అర్ధరహితం..



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ పేరు మార్పుపై గరికపాటి నరసింహారావు మాటలు అర్ధరహితంగాఉండరాదని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి) ప్రధాన కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో అర్పిసి వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ సూచించారు. మేడా శ్రీనివాస్ మాట్లాడుతూ గరికపాటి నరసింహారావు వారికి వేదం పైన, రామాయణ, హితిహాశాల పట్ల ఎంతో పట్టు గల పండితులుగా పేరు ప్రఖ్యాతలు సంపాదించారు. ఈ మధ్య కాలంలో గరికపాటి వారికి అస్సలు సంబంధం లేని వాటిపై కొన్ని వ్యాఖ్యానాలు చేస్తు ఆపకీర్తికి గురవుతున్నారు.హిందూ ధర్మం పవిత్రత కోసం, ఆ ధర్మం యొక్క శక్తి సామర్థ్యల కోసం ఎంతగానో జ్ఞానోదయం గల గరికిపాటి ఈ మధ్య పురాణ పురుషులును, దేవ దేవతలను ఏకవచనంతొ శంభోదిస్తు తన ఆహాన్ని, తన అహకార ఉపన్యాసాలను బోదిస్తున్నారు. గరికపాటి ప్రసంగాలు హిందూ మనోభావాలను గాయ పరుస్తున్నట్టుగా వుంటున్నాయి. అప్పుడప్పుడు ఒక రాజకీయ పార్టి ఆధ్యాత్మక విభాగం ప్రతినిధిగా ఉపన్యాసాలు గుప్పిస్తు ఆ ముసుగులో రాజకీయ ప్రసంగాలు చేస్తున్నారు. పీఠధిపతులు, మత ఉద్బోదకులు సామజిక చైతన్యాన్ని, హిందూ ధర్మం గొప్పతనాన్ని చాటి చెప్పేవిగా ఉండాలి . ఉన్మాదాన్ని ప్రేరేపించే విధంగా ఉండకూడదని ఆయన హితవు పలికారు. పండిత బిరుదాన్కితులైన గరికపాటి వారికి ఆంధ్ర ప్రాశిసత్యం కోసం ,చరిత్ర మూలాలు కోసం ,పౌరాణిక పవిత్రత, పోరాటాల కోసం తెలియవంటారా..! తెలిసే ఆంధ్రప్రదేశ్ పేరును తెలుగునాడుగా ప్రకటించమని గరికపాటి దుందుడుకు ప్రకటన చేస్తున్నారా ! తమిళనాడు రాష్ట్ర పేరును, ఈ మధ్య కేరళం పేరును మార్చుకున్నారు. అందుకని కొంతమంది మేధావులుగా పేర్కొంటున్న వారు ఆంధ్రప్రదేశ్ పేరును కూడా తెలుగునాడుగా మార్చుకోవాలని గరికపాటి తదితర మేధావులు ఎక్కువగా అనవసరమైన వ్యాఖ్యానాలు చేస్తున్నారు. ఆంధ్ర రాష్ట్ర చరిత్ర, గొప్పతనం , ఆ పేరులో గల శక్తి తెలియక అసందర్భ మాటలుతో గరికపాటి వంటి మేధావులు, వారి అనుంగ సేనలుతొ ఆంధ్రరాష్ట్ర ప్రతిష్ట దిగజారే ప్రమాదం వుందని ఆయన ఆవేదన చెందారు. ఆంధ్ర అనే నామం రామాయణ, మహాభారత కాలానికి ముందునుండి ఆచరణలో వుందని గరికపాటి వారు గ్రహించాలి. ఆదికవి నన్నయ్య ఆంధ్ర మహాభారతంగాను, ఆధునిక కవిత్వాన్ని అచ్చు వేయించిన బమ్మెర పోతన వంటి మహనీయులు ఆంధ్ర మహాభారతం, శ్రీ మద్ ఆంధ్ర భాగవతం గానే పురాణ కాల నిజాలను వ్రాసారు అని గరికపాటి వారు గుర్తించాలి.12వ శతబ్దనికి ముందు తెలుగు అనే పద ఉచ్చారణ లేదు . పురాతన గ్రంథాల్లో సైతం ఆంధ్ర పద ఉచ్చారణ వుందని తెలుసుకోవాలి. బాష (తెలుగు), జాతి, ప్రదేశం , సంస్కృతి కలిసిన సమైక్యతకు వారధిగా ఆంధ్ర పద ఉచ్చారణ దైవ సంకల్పంతొ ఆవిర్బవించిన పదమే ఆంధ్ర అని గరికపాటి వంటి మేధావులు ఆలోచింప చేసి ఆంధ్ర రాష్ట్ర ప్రతిష్టకు వెన్నుదన్నుగా నిలవాలని ఆయన హితబోధ చేసారు. ఆంధ్ర పద ఉచ్చారణకు పురాణకాల చరిత్రతొ పాటుగా ఉద్యమ చరిత్ర కూడా వుంది.నిజాం కాలంలో జరిగిన అనేక పోరాట పోరు బాటల్లో ఆంధ్ర అనే పదం లేకుండా ఉద్యమాలే లేవు. ఆ కోణం లోనే ఆనాడు " ఆంధ్ర మహాసభ " ఆవిర్బవించిందన్నారు. ఆంధ్ర పదంను తొలగించమని నిజాం పాలనలో ఎన్ని ఒత్తిడిలు , వేధింపులు వచ్చినా ఆంధ్ర పదంను తొలగించలేదనేది జగమెరిగిన నిజం. గరికపాటి కొన్ని సందర్భాల్లో పవిత్ర రామాయణ, మహాభారతం కోసం కూడా వ్యంగ్యంగా ఛలోక్తులు చేస్తు భక్తి సూక్తులను ఆశ్యం చేస్తున్నారు. అఖండ భారతదేశం లోనే రామాయణ, మహాభారతాలకు ఒక ప్రాశిసిత్యం వుంది. మితి మీరిన అహంతొ పవిత్ర గ్రందాలను , దైవ యోధులను గౌరవ ఉచ్చారణ లేకుండా మాట్లాడటం గరికపాటి వారికి అలవాటుగా మారింది . దైవ సందేశంలో ఉండాల్సింది ఆశ్యం కాదు ఏకగ్రత ముఖ్యం అని గరికపాటి వంటి అవధానులు వారికి తెలిసి ఈ మధ్యన ఎందుకో వారి ఉపన్యాసాలు దారి తప్పి రాజకీయ భోదనలుగా మారుతు న్నాయి.నా హిందూ ధర్మం పవిత్రత కోసం , నా ఆంధ్ర రాష్ట్ర ప్రస్థానం దారి తప్పుతున్న పరిస్థితులకు తీవ్ర ఆవేదనతొ మిమ్ములను ప్రశ్నించాల్సి వస్తుందని, యావత్ భారతదేశం లోనే ఏ రాష్ట్రానికి లేనటువంటి అదృష్టం , ఖ్యాతి ఆంధ్ర రాష్ట్రానికి వుంది . హిందూ ధర్మ ఆవిర్భావానికి ఏ విధంగా లెక్క కట్టలేమో ఆంధ్ర నామానికి కాలమానాన్ని లెక్కించలేరని ఆయన పేర్కొన్నారు. ఈ మీడియా సమావేశంలో అర్పిసి సెక్యులర్స్ సర్వశ్రీ లంక దుర్గాప్రసాద్, పెండ్యాల కామరాజు, సిమ్మా దుర్గారావు ,దుడ్డే త్రినాద్ ,బర్ల ప్రసాద్, వర్ధనపు శరత్ కుమార్, గుడ్ల సాయిదుర్గాప్రసాద్, కొల్లి సత్యనారాయణ, కాకర ప్రసాద్,ఎస్ కే దేవి, మేకా అయ్యప్ప,కంతి రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### నాగాంజలి తండ్రికి

# ఎమ్మెల్యే ఆదిరెడ్డి ఆర్థిక సహాయం అందచేత



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** బొల్లినేని ఆసుపత్రిలో ఫార్మశీ ఇంటర్న్‌గా చేస్తూ ఆత్మహత్య చేసుకున్న నాగాంజలి (అంజలి) అనే విద్యార్థిని ఘటన తెలిసిందే. అయితే ఆ సంఘటన జరిగిన సమయంలో ఆమె కుటుంబ సభ్యులను ఆర్థికంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హామీ ఇవ్వడం జరిగింది. ఆ మేరకు ఈ రోజు పోస్టల్ కాలనీలోని జనసేన పార్టీ రాజమహేంద్రవరం ఇన్‌ఛార్జ్ అనుశ్రీ సత్యనారాయణ ఇంటి వద్ద ఆయనతో కలిసి నాగాంజలి తండ్రికి 2,00,000 రూపాయల (రెండు లక్షలు) నగదు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే తాము అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షులు మజ్జి రాంబాబు, జిల్లా అధికార ప్రతినిధి దాస్యం ప్రసాద్, నాగాంజలి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### సింగవరం గ్రామంలో బాధిత కుటుంబానికి

# సహాయం అందించిన పలివెల



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం సింగవరం గ్రామం అంబేద్కర్ నగర్‌కు చెందిన పెదపాటి కాంతమ్మ ఫిబ్రవరి 22న మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న సిపిఐ (ఎంఎల్) పార్టీ రాష్ట్రకార్యదర్శి పలివెల వీరబాబు స్పందించి వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. అంత్యక్రియల (మట్ట) ఖర్చుల కోసం రూ.5,000 మరియు కార్యం ఖర్చుల కోసం రూ.10,000 మొత్తంగా రూ.15,000 రూపాయలను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా స్థానిక పార్టీ నాయకులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# కోరుకొండ తహశిల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన సుగుణ

### – మర్యాదపూర్వకంగా కలిసిన రెవెన్యూ సిబ్బంది



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ తహశిల్దార్‌గా సుగుణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బుధవారం కోరుకొండ తహశిల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన సుగుణకు, వీఆర్వోలు, రేషన్ డీలర్స్, రెవెన్యూ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. బుధవారం నుండి కోరుకొండ తాసిల్దార్ గా సుగుణ పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తాసిల్దార్ గా పనిచేసిన సుస్వాగతం పదోన్నతి పై విజయవాడ వెళ్లారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ సాయిరాం, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రామిరెడ్డి, వీఆర్వోలు, రేషన్ డీలర్స్,రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


# టిడ్కో గృహాలు వద్ద మున్సిపల్ అధికారులు

### కమీషనర్ టీవీ రంగారావు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట గొల్లపుంత టిడ్కోఅపార్ట్మెంట్ల వద్ద మున్సిపల్ అధికారులు గురువారం నుండి అందుబాటులో ఉంటారని మండపేట పురపాలక సంఘ కమిషనర్ టీవీ రంగారావు పేర్కొన్నారు.మండపేట పురపాలక సంఘ కార్యాలయంలో బుధవారం కమీషనర్ టి.వి.రంగారావు ఆధ్వర్యంలో రెవిన్యూ, ఇంజనీరింగ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్ విభాగాల శాఖాధిపతులు స్వర్ణ వార్డు సెక్రటరీ లు, టిడ్కో గృహాలు, వాటర్ శాంపిల్స్, పన్నులు వసూళ్ళు శానిటేషన్ అంశాల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా టిడ్కో గృహాలకు సంబంధించి రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ఆదేశాల మేరకు బ్లాకు లు వారీగా కేటాయించిన సిబ్బందిని సూపర్ వైజర్లలను నియమించారు. ఇప్పటివరకూ ఎంతమందితో గృహా ప్రవేశాలు చేయించారో అక్కడ ఉన్న సమస్యలను తదితర వాటిని అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది ప్రతిరోజు కేటాయించిన బ్లాకులకు వెళ్ళి త్వరితగతిన లబ్ధిదారులతో గృహా ప్రవేశాలు చేయించాలని కమీషనరు ఆదేశించారు. ప్రతి రోజు ఉదయం 6:30 గంట లకు ఇంజనీరింగ్ సిబ్బంది ఏమినిటీ సెక్రటరీలతో పాటు మెప్మా సి ఎం ఎం, సీ వో లు, రిసోర్స్ పర్సన్స్ వాటర్ శాంపిల్స్ కలెక్షన్ ఖచ్చితంగా చేయాలని పేర్కొన్నారు. సమస్యలు ఉంటే సంబంధిత అసిస్టెంట్ ఇంజనీర్లు వెంటనే చర్యలు చేపట్టాలని అదేశించారు. మునిసిపల్ రెవెన్యూకు సంబంధించి సిబ్బంది ప్రతి రోజు ఉదయం 7:00 గంట లకు పన్నులు కలెక్షన్ టీములు వారీగా చేపట్టి 100% వసూళ్ళు ఈ నెలాఖరుకు పూర్తిచేయాలని ఆదేశించారు.శానిటేషన్‌కు సంబంధించి పట్టణ పరిధిలో ఈ నెల 15 నుండి సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం అమలుచేయాలని సంబంధిత శానిటేషన్ సిబ్బంది వార్డు శానిటేషన్ సెక్రటరీలు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డిప్యూటీ ఎగ్జిక్యుటివ్ ఇంజనీర్ కె.శ్రీనివాస్, రెవిన్యూ ఆఫీసర్ మాచిరాజు రవి, శానిటరీ ఇన్స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, టౌన్ ప్లానింగ్ అధికారి కె.రమ్య, స్వర్ణ వార్డు మేనేజర్ దంటు శ్రీనివాస్, అసిస్టెంట్ ఇంజనీర్లు అనూష, దాసరి పవన్, మెప్మా సి ఏం ఏం పి సుజాత,సి ఓ లు, కార్యాలయ సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు స్వర్ణ వార్డు సెక్రటరీ లు పాల్గొన్నారు.

# న్యాయవాదులు రక్షణ చట్టాన్ని అమలు చేయాలి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం తక్షణం న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్నాలకోట వెంకటేశ్వర రావు కోరారు. గుంటూరులో సీనియర్ న్యాయవాది పై జరిగిన దాడిని ఖండిస్తూ బుధవారం పలువురు న్యాయవాదులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్ సమీపంలో జరిగిన సమావేశంలో అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్నాలకోట వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల కాలంలో న్యాయవాదులపై దాడులు ఎక్కువయ్యాయని, ఇప్పటికైనా కేంద్రం స్పందించి అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్ ను తీసుకురావాలన్నారు. గుంటూరులో న్యాయవాదిపై దాడికి పాల్పన వారిని తక్షణం కఠినంగా శిక్షించాలని అన్నారు. ఈ సమావేశంలో న్యాయవాదులు వీర వెంకట సత్యనారాయణ, పి.ఎల్.నాగేశ్వరరావు, నక్కాని శ్రీహరి,గున్న సత్యనారాయణ, శకుంతల,పి వి కే డి నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# అభిమానులకు షాకిచ్చిన యష్..

## టాక్సిక్ సినిమాకు ఊహించని నిర్ణయం..



మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా చిత్రాల్లో టాక్సిక్ ఒకటి. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, టీజర్ సినిమాపై ఓ రేంజ్ హైప్ క్రియేట్ చేశాయి. రాకింగ్ స్టార్ యష్ ప్రధాన పాత్రలో డైరెక్టర్ గీతూ మోహన్ దాస్ తెరకెక్కిస్తున్న ఈ సినిమా ఎప్పుడెప్పుడు విడుదలవుతుందా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు ఫ్యాన్స్. ఈ క్రమంలోనే ఇప్పుడు మేకర్స్ ఊహించని నిర్ణయం తీసుకున్నారు. కన్నడ రాకింగ్ స్టార్ యష్ ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ టాక్సిక్. కేజీఎఫ్ 1, 2 చిత్రాల తర్వాత ఈ హీరో నటిస్తున్న సినిమా కావడంతో ఇప్పటికే భారీ హైప్ నెలకొంది. ముఖ్యంగా ఇటీవల విడుదలైన గ్లింప్స్, టీజర్ సినిమాపై మరిన్ని అంచనాలు క్రియేట్ చేశాయి. ఈ చిత్రాన్ని మార్చి 19న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ క్రమంలోనే మరికొన్ని రోజుల్లో ఉగాది కానుకగా ఈ సినిమా అడియన్స్ ముందుకు రావాల్సి ఉంది. కానీ ఇప్పుడు చిత్రయూనిట్ ఊహించని నిర్ణయం తీసుకుంది. ఈ సినిమా విడుదలకు మరికొన్ని రోజులు మాత్రమే మిగిలి ఉండగా.. తాజాగా ఈ చిత్రాన్ని వాయిదా వేసినట్లు మేకర్స్ ప్రకటించారు. అంతేకాదు కొత్త తేదీని సైతం వెల్లడించారు. ఈ చిత్రాన్ని జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేయనున్నట్లు తెలిపారు. పశ్చిమ ఆసియా దేశాల్లో యుద్ధ భయం పెరుగుతుంది. ఈ సంక్షోభం ఇంకా పరిష్కారం అయినట్లు కనిపించడం లేదు. అబుదాబి వంటి ప్రదేశాలలో దాడులు జరుగుతున్నాయి. ఈ కారణంగానే టాక్సిక్ సినిమాను వాయిదా వేస్తున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. మార్చి 8న ఈ సినిమా ట్రైలర్ విడుదల కావాల్సి ఉంది. ఇందుకు సంబంధించిన సన్నహాలు సైతం పూర్తయ్యాయి. అయితే ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం కారణంగా సినిమా వాయిదా పడింది. మరోవైపు ధురంధర్ 2 సైతం అటు గల్ఫ్ దేశాలలో విడుదల కావడం లేదు. ఇక భారతదేశంలో మాత్రం ఈ సినిమాకు లైన్ క్లియర్ అయిపోయినట్లే. గతేడాది డిసెంబర్ లో ఎలాంటి హడావిడి లేకుండా విడుదలైన ధురంధర్ సినిమా సంచలనం సృష్టించింది. ఏకంగా రూ.1000 కోట్లకు పైగా కలెక్షన్స్ రాబట్టింది. ఇదిలా ఉంటే టాక్సిక్ చిత్రాన్ని 'కెవిఎన్' నిర్మిస్తోంది. ఈ చిత్రానికి యష్ కూడా నిర్మాత. ఇందులో మొత్తం ఐదుగురు హీరోయిన్లు నటిస్తున్నారు.

# యాంకర్ టూ హీరోయిన్..

## నెట్టింట పిచ్చెక్కిస్తున్న అందాల ముద్దుగుమ్మ..

టిక్ టాక్ వీడియోస్, ఇన్ స్టా రీల్స్ ద్వారా సోషల్ మీడియాలో విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకున్నవారు చాలా మంది ఉన్నారు. ఇదే ఫేమ్ తో అటు ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి సక్సెస్ అయ్యారు. అలాంటి వారిలో ఈ ముద్దుగుమ్మ ఒకరు. టిక్ టాక్ వీడియోలతో సందడి చేసింది. తర్వాత యాంకర్ గా బుల్లితెరపై అలరించింది. అలాగే హీరోయిన్ గా వెండితెరపై మెరిసింది. బుల్లితెరపై తనకంటూ మంచి క్రేజ్ సొంతం చేసుకుంది దీపికా పిల్లి. ఒకప్పుడు టిక్ టాక్ వీడియోస్ చేసి విపరీతమైన ఫాలోయింగ్ సంపాదించుకుంది. ఇక అదే ఫేమ్ తో బుల్లితెరపైకి అడుగుపెట్టింది. పలు షోలలో యాంకరింగ్ చేస్తూ అలరించింది. అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి సినిమా తర్వాత ఇండస్ట్రీలో దీపికా సైలెంట్ అయ్యింది. అటు బుల్లితెరపై కూడా కనిపించడం లేదు. తాజాగా ఈ అమ్మడు తన ఇన్ స్టాలో షేర్ చేసిన ఫోటోస్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. పింక్ కలర్ లెహంగాలో మరింత అందంగా కనిపిస్తుంది దీపికా. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మకు ఇన్ స్టాలో 2.1 మిలియన్ ఫాలోవర్స్ ఉన్నారంటే ఈ బ్యూటీకి ఏ స్థాయిలో క్రేజ్ ఉందో చెప్పక్కర్లేదు. ప్రస్తుతం ఈ అమ్మడు తెలుగులో సరైన అవకాశాల కోసం వెయిట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. తక్కువ సమయంలోనే తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ ముద్దుగుమ్మ.. ఇప్పుడు కథానాయికగా మారిన సంగతి తెలిసిందే. జబర్దస్త్, ఢీ షోలలో యాంకర్ గా మెరిసిన దీపికా.. ఆ తర్వాత వాంటెడ్ పండుగాడు సినిమాతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమాతోపాటు యాంకర్ ప్రదీప్ మాచిరాజుతో కలిసి అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి సినిమాలోనూ నటించింది. అయితే ఈ రెండు చిత్రాలు పెద్దగా ఆడలేదు. అందం, అభినయంతో ప్రేక్షకుల హృదయాల్లో చోటు సంపాదించుకుంది. ఈ అమ్మడు నెట్టింట చాలా యాక్టివ్.





# అభిషేక్ శర్మ ఏ నంబర్ వన్ .. సెమీస్‌లో రాణిస్తేనే ర్యాంకు పదిలం

టీ20ల్లో ఐసీసీ ర్యాంకులు వచ్చేశాయి. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో టీమ్ఇండియా ప్లేయర్లే అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. అయితే, ఈ వారంలో జరగనున్న మ్యాచుల్లో రాణించడం భారత ఆటగాళ్లకు అత్యంత కీలకం. లేకపోతే ర్యాంకింగ్స్‌పై ప్రభావం పడే ప్రమాదం లేకపోలేదు. టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత డ్యాషింగ్ ఆటగాడు అభిషేక్ శర్మ (874 పాయింట్లు) తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. ఈ ప్రపంచ కప్‌లో అతడి నుంచి కేవలం ఒకే ఒక్క హాఫ్ సెంచరీ మాత్రమే వచ్చింది. మూడు మ్యాచుల్లో డకౌట్ అయిన సంగతి తెలిసిందే. అతడి వెనుకనే పాకిస్థాన్ ఓపెనర్ సహిబ్జాద ఫర్హాన్ (848) కాచుకొని ఉన్నాడు. శ్రీలంకపై సెంచరీతో చెలరేగిన అతడు తన పాయింట్లను భారీగా పెంచుకున్నాడు. ఒక స్థానం మెరుగుపర్చుకుని మూడు నుంచి రెండులోకి వచ్చాడు. ఇంగ్లాండ్ ఆటగాడు ఫిల్ సాల్ట్ (803) మూడు ర్యాంకు పడిపోయాడు. పాతుమ్ నిశాంక (766)ను వెనక్కి నెట్టిన ఇషాన్ కిషన్ (783) నాలుగులోకి దూసుకొచ్చాడు. హైదరాబాదీ కుర్రాడు తిలక్ వర్మ (749) ఆరో ర్యాంక్‌కు చేరాడు. ఇక విండీస్‌పై అజేయంగా 97 పరుగులు చేసి గెలిపించిన సంజు శాంసన్ ఏకంగా 25 స్థానాలు ఎగబాకి 40వ ర్యాంకుకు చేరాడు.

**వరుణ్‌దే అగ్రస్థానం..**

టీ20 ప్రపంచ కప్‌లో మెరుగైన బౌలింగ్‌తో భారత విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న బౌలర్లలో వరుణ్ చక్రవర్తి, జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ ముందున్నారు. ఐసీసీ బౌలింగ్ ర్యాంకుల్లోనూ మెరుగ్గా రాణించారు. వరుణ్ చక్రవర్తి (818) అగ్రస్థానంలోనే కొనసాగుతుండగా.. జస్‌ప్రీత్ బుమ్రా (671) ఎనిమిది నుంచి ఏడో ర్యాంకుకు చేరాడు. అర్ష్‌దీప్ సింగ్ (653) ఏకంగా ఆరు స్థానాలు దూసుకొచ్చి 13వ ర్యాంకును సొంతం చేసుకున్నాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా (328) టాప్ ర్యాంక్‌లో ఉండగా.. భారత స్టార్ హార్దిక్ పాండ్య (284) రెండో స్థానానికి వచ్చాడు. సైమ్ ఆయూబ్ (275) కిందకి దిగజారి మూడో ర్యాంకుకు పరిమితమయ్యాడు. టాప్ 10లో భారత్ తరఫున పాండ్యతోపాటు శివమ్ దూబె (9వ ర్యాంకు) మాత్రమే ఉన్నాడు.

# ఐసీసీ నాకౌట్ మ్యాచ్‌ల్లో తోపు..

## కట్‌చేస్తే.. సొంత టీం పాలిట మాత్రం విలన్ భయ్యో..!






సౌతాఫ్రికా వర్సెస్ న్యూజిలాండ్ జట్లు తొలి సెమీస్‌లో తలపడేందుకు సిద్ధమయ్యాయి. అయితే, ఓ సౌతాఫ్రికా ప్లేయర్ మాత్రం తన సొంత జట్టు పాలిట విలన్‌లా తయారయ్యాడు. దీంతో ఎంత భారీ స్కోర్ చేసినా, ఒక్క మ్యాచ్‌లోనూ గెలవకపోవడం గమనార్హం. దక్షిణాఫ్రికా విధ్వంసకర బ్యాట్స్‌మెన్ డేవిడ్ మిల్లర్, ఐసీసీ నాకౌట్ మ్యాచ్‌లలో తన బ్యాటింగ్ పవర్ చూపిస్తున్నాడు. వివిధ టోర్నమెంట్‌లలో జరిగిన ముఖ్యమైన మ్యాచ్‌లలో అతను సెంచరీలు, హాఫ్ సెంచరీలు బాదాడు. అయితే, దురదృష్టవశాత్తు ఆ మ్యాచ్‌లలో ఏవీ విజయానికి దారి తీయలేదు.

**డేవిడ్ మిల్లర్ ఐసీసీ నాకౌట్ మ్యాచ్‌లలో సాధించిన కొన్ని ముఖ్యమైన స్కోర్లు:**

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 సెమీ ఫైనల్: వర్సెస్ న్యూజిలాండ్ - 100* (67). ఐసీసీ టీ20 ప్రపంచ కప్ 2024 ఫైనల్: వర్సెస్ భారత్ - 21 (17). ఐసీసీ వన్డే ప్రపంచ కప్ 2023 సెమీ ఫైనల్: వర్సెస్ ఆస్ట్రేలియా - 101 (116). ఐసీసీ వన్డే ప్రపంచ కప్ 2015 సెమీ ఫైనల్: వర్సెస్ న్యూజిలాండ్ - 49 (18). ఐసీసీ టీ20 ప్రపంచ కప్ 2014 సెమీ ఫైనల్: వర్సెస్ భారత్ -23* (12). ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2013 సెమీ ఫైనల్: వర్సెస్ భారత్ -56* (51). డేవిడ్ మిల్లర్ ఈ ప్రదర్శన అతని వ్యక్తిగత ఆటతీరును నిరూపిస్తుంది. కానీ, జట్టు గెలవకపోవడం పట్ల అతను ఖచ్చితంగా నిరాశకు లోనవుతున్నాడు. ముఖ్యమైన మ్యాచ్‌లలో అతను ఆడే ఇన్నింగ్స్ జట్టు విజయానికి దారితీయాలని అభిమానులు ఆశిస్తున్నారు.

# టీ20 వరల్డ్ కప్ వ్యూయర్ షిప్‌లో రికార్డ్ బద్దలు



ప్రస్తుత పొట్టి ప్రపంచకప్ 2026.. వ్యూయర్‌షిప్ పరంగా రికార్డు సృష్టిస్తోంది. ఇప్పటి వరకు భారత్‌లో దాదాపు 50 కోట్ల మంది వీక్షించినట్లు ఐసీసీ ఛైర్మన్ జైషా తెలిపారు. టీ20 ప్రపంచకప్ చరిత్రలో ఇదే రికార్డని వెల్లడించారు. జియో హాట్ స్టార్‌లో గరిష్ఠంగా 6.05 కోట్ల మంది వీక్షించినట్లు ఆయన పేర్కొన్నారు. రానున్న మ్యాచుల్లోనే ఇదే స్థాయిలో వీక్షణలతో కొత్త రికార్డులు నమోదవుతాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. 'ప్రస్తుత టీ20 ప్రపంచకప్ 2026ను అత్యంత ప్రేక్షకాదరణ పొందిన ఈవెంట్‌గా మార్చాలనే ఆశయంతో ప్రారంభించాం. భారతదేశంలో ఈ ఈవెంట్‌కు వీక్షకుల సంఖ్య 50 కోట్లను (500 మిలియన్లు) దాటింది. ఇది టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే అత్యధికం. జియో హాట్ స్టార్ వీక్షకుల సంఖ్య 6.05 కోట్లకు (60.5 మిలియన్లు) చేరుకుంది. ఈ రాత్రి నుంచి నాకౌట్ మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. వీటినీ భారత అభిమానులు వీక్షించి, మరిన్ని రికార్డులు బద్దలు కొట్టాలని ఆశిస్తున్నాం' అని ఆయన పేర్కొన్నారు. ఈ రోజు (బుధవారం) కోల్‌కతాలోని ఈడెన్‌గార్డెన్స్ వేదికగా దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ మధ్య సెమీఫైనల్-1 మ్యాచ్ జరగనుంది. అలాగే రేపు (గురువారం) ముంబయిలోని వాంఖడే స్టేడియం వేదికగా గురువారం టీమ్ఇండియా, ఇంగ్లాండ్ సెమీఫైనల్స్-2లో తలపడనున్నాయి. ఈ మ్యాచుల్లో గెలిచిన జట్లు ఫైనల్‌కు చేరుకుంటాయి. ఆదివారం అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియం వేదికగా ఫైనల్ మ్యాచ్ జరగనుంది.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com